RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 65 శనివారం, ఏప్రిల్ 6, 2024 పేజీలు : 4

## ఒకప్పటి ఆ బాలీవుడ్ నటి ఆస్తుల విలువ రూ. 122 కోట్లట!

న్యూఢిల్లీ: ఒకప్పటి బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ హేమమాలిని తాజాగా తన ఆస్తుల వివరాలను ఎన్నికల సంఘానికి అందజేశారు. ఉత్తరప్రదేశ్ లోని మధుర నియోజకవర్గంనుంచి ఇప్పటికే రెండుసార్లు గెలిచిన హేమమాలిని, మూడోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. నటనను తన వృత్తిగా ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న ఈ డ్రీమ్ గర్ల్, తనకు 122 కోట్ల రూపాయల స్థిర, చర ఆస్తులు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద ఒక మెర్సిడెజ్ బెంజ్, ఆల్కజార్, మారుతి వాహనాలు ఉన్నాయని అఫిడవిట్ లో పేర్కొన్నారు.

### జరిగిన అభివృద్ధి... - పిఎం మోడీ

# ట్రయలర్ మాత్రమే



న్యూఢిల్లీ: గత పదేళ్లలో తన ప్రభుత్వం చేసిన పనులు కేవలం ట్రయలర్ మాత్రమేనని, రానున్న రోజుల్లో మరిన్ని చూస్తారని ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం వ్యాఖ్యానించారు. రాజస్థాన్‌లోని చురులో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ, గత పదేళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో పెద్ద విషయమేమీ కాదని, ఇప్పటి దాకా జరిగిందంతా ట్రయలర్ మాత్రమేనని అన్నారు. ఇప్పటి వరకు మోడీ చేసినదంతా కేవలం అల్పాహారం మాత్రమే..విందు భోజనం ముందుంది అంటూ ప్రధాని చెప్పారు. ఇంకా చేయాల్సింది చాలా ఉందని, ఎన్నో కలలు మిగిలి ఉన్నాయని, దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సి ఉందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతూ సైన్యాన్ని అవమానించిన కాంగ్రెస్ దేశఖ్యూన్ని చీల్చడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు.

## బీజేపీకి కూన శ్రీశైలం

# గుడ్ బై



హైదరాబాద్ : లోక్ సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార పార్టీ కాంగ్రెస్ లో చేరిక పర్వం ఊపందుకుంది. ఇప్పటికే కీలక నేతలు ఆ పార్టీలో చేరగా, తాజాగా మరో కీలక నేత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత కూన శ్రీశైలం గౌడ్ శుక్రవారం ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్ బీజేపీలో చేరారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి టీఆర్ఎస్ అభ్యర్థి కేపీ వివేకానంద్ చేతిలో ఓడిపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ టీవీ డిబేట్ సందర్భంగా గౌడ్ పై వివేకానంద్ దాడి చేసిన వీడియో ఆన్ లైన్ లో పాపులర్ అయిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సీనియర్ నేతలు పట్నం మహేందర్ రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు గౌడ్ ను ఆయన ఇంటికి వెళ్లి రేవంత్ రెడ్డి తరపున కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.



## టీడీపీలో చేరిన రఘురామకృష్ణరాజు

పాలకొల్లు: నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు టీడీపీ లో చేరారు. పాలకొల్లు సభలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఆయన ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ.. చంద్రబాబు చొరవతో మళ్లీ ప్రజలముందుకొచ్చానన్నారు. చంద్రబాబు, ప్రజల రుణంతీర్చుకుంటానని చెప్పారు. జూన్ 4న చంద్రబాబు, పవన్ ప్రభంజనం సృష్టించబోతున్నారని సభలో అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "ఒక సైకో పాలనలో ప్రాణాలు ఒడ్డి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన వ్యక్తి రఘురామ. మీ అందరి ఆమోదంతో పాలకొల్లులో ఆయన్ను మనస్ఫూర్తిగా తెదేపాలోకి ఆహ్వానిస్తున్నాం.

పార్టీలో చేర్చుకొంటున్నాం. ఒక ఎంపీని తన నియోజకవర్గానికి రాకుండా చేసిన దుర్మార్గుడు ఎవరు? ఇది న్యాయమా? మీకు ఆమోద యోగ్యమా? ఏంటీ అరాచకం? ఏంటీ సైకో పాలన? గతంలో ఆయన్ను పోలీసుల కస్టడీలోకి తీసుకొని ఇష్టానుసారంగా చిత్రహింసలకు గురిచేశారు. రాష్ట్రపతి, గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి అన్నివిధాలా ప్రయత్నిస్తే.. చివరకు కోర్టు జోక్యంతో ఆయన బయటపడ్డారు.. లేదంటే ఈరోజు ఆయన్ను మీరు చూసేవాళ్లు కాదు. అందుకే దుర్మార్గుడి పాలన నుంచి ప్రజాస్వామ్యాన్ని, పిల్లల భవిష్యత్తును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

## లిక్కర్ స్కాం కేసులో...

# కీలక పరిణామం



న్యూఢిల్లీ : ఎమ్మెల్సీ కవితకు మరో బిగ్ షాక్ తగిలింది. లిక్కర్ స్కాం కేసులో అరెస్ట్ అయి తిహార్ జైలులో ఉన్న కవితను విచారించేందు సీబీఐ సిద్ధమైంది. ఈ క్రమంలో కవితను విచారించేందుకు కోర్టును అనుమతి కోరింది సీబీఐ. కోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో జైల్లోనే కవిత విచారణ జరగనుంది. లిక్కర్ స్కాం కేసులో మార్చి 15న ఎమ్మెల్సీ కవితను ఈడీ అదుపులోకి తీసుకుంది. మరో వైపు ఇదే కేసులో విచారించేందుకు సీబీఐ ఎమ్మెల్సీ కవితకు పలుమార్లు నోటీసులు పంపించగా.. కవిత మాత్రం సీబీఐ నోటీసులు పట్టించుకోకుండా విచారణకు హాజరు కాలేదు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవిత పేరును నిందితురాలిగా ఛార్జిషీట్‌లో సీబీఐ చేర్చింది. ఈ మేరకు నిందితురాలిగా పేర్కొంటూ 41A కింద సమన్లు పంపింది. ఇటీవల లిక్కర్ స్కాం కేసులో ఫిబ్రవరి 26న ఢిల్లీలోని తమ కార్యాలయానికి విచారణకు రావాలని సీబీఐ కవితకు నోటీసులు పంపింది.


## పదేళ్లలో అన్ని రంగాల్లో విధ్వంసం: చిదంబరం



ఢిల్లీ: మోడీ హయాంలో గత పదేళ్లుగా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగలదేని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ అగ్రనేత పి చిదంబరం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన సందర్భంగా చిదంబరం మాట్లాడారు. గడిచిన పదేళ్లుగా అన్ని రంగాల్లో విధ్వంసం జరిగిందని, ధరలు పెరిగిపోయాయని, నిరుద్యోగిత పెరిగిందని, ఆశగా ఎదురుచూసిన యువతకు నిరాశే మిగిలిందని మండిపడ్డారు. గడిచిన ఐదేళ్లలో ప్రజాస్వామ్యం బలహీనపడిందని విమర్శలు గుప్పించారు. ధనికుల వల్ల ధనికుల కోసం, ధనికుల చేత అనేలా బిజెపి పాలన ఉందని ఎద్దేవా చేశారు.

## ప్రధానిని కుంభకర్ణునితో

# పోల్చిన మమత



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోడీపై తాజాగా తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో మహిళలు, ముస్లింలు, దళితులపై అత్యాచారాలు సంభవించినప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ 'కుంభకర్ణుని' వలె నిద్ర పోతున్నారని మమత విమర్శించారు. సందేశ్‌ఖాలి సంఘటనపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ప్రధాని నిశితంగా విమర్శించిన మరునాడు మమత ఈ వ్యాఖ్యలు చేశారు. సందేశ్‌ఖాలిలో నిందితునిపై తమ ప్రభుత్వం చర్య తీసుకున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలియజేశారు. 'దేశానికి పతకం సాధించిన సాక్షి (మాలిక్)పై అత్యాచారాలు జరిపిన నిందితులపై ఏ చర్య తీసుకున్నారో చెప్పండి' అని మోడీని మమత అడిగారు. 'మీరు అతనిని ఒక నాయకుని చేశారు. అతనిపై ఒక్క ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేయలేదు' అని ఆమె ఆరోపించారు. 'మోడీ బాబు! బిల్కిస్ హత్య జరిగినప్పుడు మీరు నిద్ర పోతున్నారు. హత్రాస్‌లో ముస్లింలు, దళితులు అవమానాలకు గురైనప్పుడు మీరు కుంభకర్ణునిలా నిద్రిస్తున్నారు. ఎన్ఆర్‌సి సమయంలో అస్సాంలో జనం వధ జరిగినప్పుడు మీరు నిద్రిస్తున్నారు' అని మమత విమర్శించారు.

## తుక్కుగూడ సభ వేదికగా...

# మాస్టర్ స్కెచ్



తుక్కుగూడ: 2023... సెప్టెంబర్ 17.. వేదిక తుక్కుగూడ మైదానం.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సమరం కోసం పూరించిన శంఖా రావం.. పోటెత్తిన జనం.. చెప్పిమరీ అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ పార్టీ. అందుకే.. తమకు కలిసొచ్చిన తుక్కుగూడ సెంటిమెంట్‌ను లోక్‌సభ ఎన్నికల్లో కూడా రిపీట్ చేస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఈనెల ఆరున శనివారం సాయంత్రం జరిగే తుక్కుగూడ జనజాతర సభతో హిస్టరీ రిపీట్ చేయాలన్నది రేవంత్ టీమ్ లక్ష్యం. పదిలక్షలమంది జనాన్ని సమీకరించాలన్నది టార్గెట్. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లాంటి జాతీయ నేతలు హాజరయ్యే సభ కనుక దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది తెలంగాణ కాంగ్రెస్ పార్టీ. 70 ఎకరాల్లో సభ, 550 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు... వారం రోజులుగా రూపుదిద్దుకుంటున్న సభా వేదిక.. ఆదిలాబాద్ మొదలు ఆలంపూర్ వరకు, జహీరాబాద్ నుంచి భద్రాచలం వరకు జరుగుతున్న జన సమీకరణ... ఇవన్నీ కలిసి తుక్కుగూడ సభ తెలంగాణ రాజకీయాల్లో మోస్ట్‌వాంటెడ్‌గా మార్చేశాయ్. వీటన్నికంటే ముఖ్యంగా పాంచ్‌న్యాయ్-పచీస్ గ్యారంటీస్ పేరుతో లాంచనంగా విడుదలైన కాంగ్రెస్ మేనిఫెస్టో తుక్కుగూడ సభావేదిక మీదే జనానికి పరిచయం కాబోతోంది. అందుకే దేశం చూపు తుక్కుగూడ వైపు అంటూ ప్రచారం చేసుకుంటోంది కాంగ్రెస్ పార్టీ. కనీసం 13 ఎంపీ స్థానాలు గెలవాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ.. ఆ మేరకు పార్టీ లీడర్‌షిప్‌ను బలోపేతం చేసుకుంటోంది. గేట్లెత్తేశామని ఓపెన్‌గా చెప్పిమరీ ఆపరేషన్ ఆకర్ష్ షురూ చేస్తోంది. అందుకే... తుక్కుగూడ సభను చేరికల సభగా కూడా అంతర్గతంగా ప్రకటించుకుంటోంది. కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలుంటా యని ఇప్పటికే సంకేతాలు కూడా వచ్చేశాయ్. హైకమాండ్ సమక్షంలో పార్టీలో చేర్చుకునేందుకు కొన్నాళ్లుగా ప్రతిపక్ష నేతలకు గాలం వేస్తోంది కాంగ్రెస్ పార్టీ.


## ఉప్పల్ స్టేడియంలో రేవంత్ రెడ్డి సందడి



ఉప్పల్ / హైదరాబాద్ ఏప్రిల్, 5 : ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ వర్సెస్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య కీలక మ్యాచ్ జరుగుతోంది. అయితే, ఈ మ్యాచ్‌కు సెలబ్రెటీల తాకిడి పెరిగింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ మ్యాచ్ చూసేందుకు ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. విక్టరీ వెంకటేష్‌తో కలిసి మ్యాచ్‌ను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఫొటోలు సందడి చేస్తున్నాయి. కాగా, సీఎం రేవంత్‌ను చూసిన ప్రేక్షకులు సీఎం, సీఎం అంటూ అరుపులు మొదలుపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి మ్యాచ్ చూసేందుక వచ్చారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి కూడా స్టేడియంలో కనిపించారు.

## భారత మొదటి ప్రధాని బోస్:

# కంగనా వ్యాఖ్యలు వైరల్!



న్యూఢిల్లీ ఏప్రిల్, 5: వివాదాస్పద వ్యాఖ్యలు చేసి రెచ్చగొట్టడంలో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ని మించినవారు లేరు. ఒక్కమాటలో చెప్పాలంటే కంగనా ఎక్కడుంటే వివాదాలు అక్కడుంటాయి. కొన్నేళ్ల క్రితం భారతీయ జనతాపార్టీ అధికారంలోకి వచ్చిన 2014లోనే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని ఆమె కామెంట్ చేసి, వివాదానికి ఆజ్యం పోశారు. తాజాగా తను చేసిన మరో వివాదాస్పద వ్యాఖ్య నెట్టింట వైరల్ అవుతోంది. ఇటీవల ఒక చానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె భారత మొట్టమొదటి ప్రధాని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని వ్యాఖ్యానించారు. అయితే ఇంటర్వ్యూ చేస్తున్న వ్యక్తి భారత మొదటి ప్రధాని బోస్ కాదని చెప్పినా ఆమె వినకుండా 'మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు బోస్ ఎక్కడకు వెళ్లారు? ఆయన ఎలా అదృశ్యమయ్యారు? అని ప్రశ్నించారు. బోస్ 1945లో మరణించగా, భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిది. కంగనా వ్యాఖ్యలపై నెటిజన్లు ఆమెతో ఒక ఆట ఆడుకుంటున్నారు. 'కంగనా లెక్క ప్రకారం ఇండియాకు 2014లో స్వాతంత్ర్యం వచ్చింది.

## సంపాదకీయం

# మోదీకే అన్ని వర్గాల మద్దతు..!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశ పాలనా బాధ్యతలు చేపట్టి మరో నెలకు పదేళ్లు పూర్తి అవుతుంది. ఈ పదేళ్లలో ఆయన ఎన్నో ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. కాని ఏ వ్యక్తి పాలన గురించి అయినా సమగ్రంగా అన్ని కోణాలతో సమీక్షించిన తర్వాతే సరైన విధంగా అంచనాకు రావడం సరైంది. ఈ దృష్ట్యా చూస్తే అత్యధిక ప్రజలు మోదీ నాయకత్వం కొనసాగడం వల్లే భారతదేశం పటిష్టంగా మారుతుందని, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట ఇనుమడిస్తుందని, తమ జీవితాలు బాగుపడతాయని భావిస్తున్నారు. సాధారణంగా చదువుకున్నవారు, దేశ సంపదను పెంచేవారు ఆ దేశ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తారు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మోదీ నాయకత్వాన్ని ఈ దేశంలో విద్యావంతులు, మధ్యతరగతి, సంపన్న వర్గాలు కూడా సమర్థిస్తున్నారు. 'వై ఇండియాస్ ఎలైట్స్ బ్యాక్ నరేంద్ర మోదీ' అన్న శీర్షికతో తాజాగా బ్రిటన్‌కు చెందిన అంతర్జాతీయ పత్రిక ద ఎకనమిస్ట్‌లో ప్రచురించిన ఒక వ్యాసంలో మోదీ ప్రజాదరణలో ప్రపంచ దేశాధినేతలందరిలోనూ విభిన్నమైన వ్యక్తి అని ఈ పత్రిక తెలిపింది. సబ్ కాసాథ్, సబ్ కా వికాస్ అన్న నినాదంతో పరిపాలన ప్రారంభించిన మోదీ ఇవాళ మహిళలు, రైతులు, యువకులు, పేదలు అని నాలుగు వర్గాలుగా సమాజాన్ని విభజించి వారికి ప్రయోజనాలు నిర్దిష్టంగా చేరేలా కృషి చేస్తున్నారు. దేశ ఆర్థిక విధానాలు సంపన్నుల నుంచి సామాన్యుల వరకూ అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి, ఆర్థిక పటిష్టతే ప్రధాన లక్ష్యాలుగా ఒక సమతుల్య దృక్పథంతో పనిచేస్తున్నారు. నిజానికి ప్రపంచంలోని చాలా దేశాల్లో ప్రజాదరణ గల నేతల్ని అక్కడి ఉన్నత స్థాయి వర్గం వ్యతిరేకిస్తుంది. అమెరికాలో ట్రంప్ కూడా ఈ పరిస్థితి ఎదుర్కొన్నారు. విద్యావంతుల్లో కేవలం 26 శాతం మంది మాత్రమే ట్రంప్‌కు మద్దతిచ్చారు. సామాన్య జనంలో 50శాతం ఆయనకు మద్దతు పలికారు. కాని మోదీకి విద్యావంతుల్లో 80శాతం, ప్రాథమిక విద్యా స్థాయిని కూడా దాటని సామాన్యుల్లో 66 శాతం మద్దతు ఉన్నదని గ్యాలప్ సర్వేలో వెల్లడైంది. 'వివిధ దేశాల్లో నేతలు రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. కాని భారత్‌లో మోదీకి ఆ పరిస్థితి లేదు. అందుకే మూడోసారి తిరుగులేని విజయం సాధిస్తున్న మోదీని అత్యంత శక్తివంతుడైన నేతగా అభివర్ణించవచ్చు' అని ఎకనామిస్ట్ అభిప్రాయపడింది. 'ఉన్నత స్థాయి వర్గాల మద్దతు పొందే క్రమంలో ఆయనేమీ సామాన్యుల మద్దతును కోల్పోలేదు' అని వివరించింది. 2019 ఎన్నికల్లో డిగ్రీ చదువుకున్న వారిలో 42 శాతం మోదీకే ఓటువేశారని లోక్‌నీతి సిఎస్‌డిఎస్ సర్వే కూడా వివరించింది. ఆర్థిక వ్యవస్థే మోదీకి ఉన్నత వర్గాల్లో ఆదరణ పెరగడానికి ప్రధాన కారణం అని ద ఎకనామిస్ట్ పత్రిక పేర్కొంది. మోదీ హయాంలో భారత్ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు అంతర్జాతీయంగా తన ప్రత్యేకతను, విశిష్టతను నిరూపించు కోవడంలో మోదీ విజయం సాధించారు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా భారతీయులందరూ భారత్ ఆర్థిక వ్యవస్థ చైనాను ఢీకొనాలంటే మోదీ లాంటి నాయకుడు అవసరమని భావిస్తున్నారు. అంతేగాక, మోదీ లాంటి బలమైన నేత ఎవరూ ప్రతిపక్షాల్లో కనుచూపుమేర కనపడడం లేదు. ఒక విశ్వసనీయ ప్రతిపక్ష పార్టీ అవతరించేంతవరకూ మోదీ ప్రాబల్యానికి ఢోకా లేదని ద ఎకనమిస్ట్ ప్రతినిధులతో పాటు ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ కూడా మోదీ హయాంలో భారత దేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారిందని, ఎన్ని సంక్షోభాలు వచ్చినా భారతదేశ అభివృద్ధి వేగం తగ్గకుండా ఆయన చూశారని తాజా సంచికలో ప్రశంసించింది. మోదీ పాలనలో కోట్లాది మంది భారతీయుల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోదీ మూడోసారి అఖండ విజయం తప్పక సాధిస్తారని చెప్పేందుకు భారతీయ స్టాక్ మార్కెట్ ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మూడు రెట్లు అభివృద్ధి చెందడమే నిదర్శనమని తెలిపింది. ఎక్కడైతే గ్రామీణ సంక్షోభం, పేదరికం ఉన్నదో అక్కడ మోదీ ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిస్థితి మెరుగుపరుస్తున్నదని ఈ పత్రిక తెలిపింది. ఉచిత ఆహార ధాన్యాలు, శౌచాలయాలు, గ్యాస్ సిలిండర్లు, గృహనిర్మాణం, ఎల్? ఇడి విద్యుద్దీపాలు, ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్ ఫోన్లు, దాదాపు ఉచితంగా మొబైల్ డాటా లభ్యం కావడం ఇవన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇవాళ గ్రామీణ జీవితమే మారి పోయింది. భారతదేశంలో వినియోగదారుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని, 2027 నాటికి ఇండియా ప్రపంచంలో అతి పెద్ద వినియోగ మార్కెట్‌గా అవతరిస్తుందని సిఎన్?బిసి ఒక వార్తాకథనంలో పేర్కొంది. గ్రామాలకు, పట్టణాలకూ మధ్య వ్యత్యాసాలు తగ్గిపోవడం వల్ల వినియోగదారులు పెరిగి పోతున్నారని, మార్కెట్ గ్రామాలకు కూడా విస్తరిస్తోందని తెలిపింది. దేశంలో అత్యధికంగా ఉన్న యువ జనాభా కూడా వినియోగదారులు పెరిగేందుకు కారణమని, యువత ఎలెక్ట్రానిక్స్‌తో సహా వివిధ పరికరాలను కొనుగోలు చేస్తున్నారని తెలిపింది.

# నాలుగు నెలల పాలనలో నానా తిప్పలు : హరీశ్ రావు

మెదక్: కాంగ్రెస్ పార్టీ హామీలు నమ్మి, ఓటేసి ప్రజలు మోసపోయారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి మడమ తిప్పారని విమర్శించారు. రైతుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేశారా? అని నిలదీశారు. మెదక్ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రుణ మాఫీ డబ్బులు రాలేదని... బ్యాంకు అధికారులు రైతుల ఇళ్లపై పడ్డారు. రూ. 2 లక్షల రుణ మాఫీ జరిగిన వాళ్లు కాంగ్రెస్ కు ఓటేయండి, రుణ మాఫీ కాకపోతే బిఆర్ఎస్ కు ఓటేయండి. వరి పండిస్తే రూ. 500 బోనస్ ఇస్తామన్నారు, ఇచ్చారా? వడ్లపై దృష్టిపెట్టమంటే.. రేవంత్ రెడ్డి వలసలపై దృష్టి పెట్టారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్నారు. కానీ చేయలేదు. నాలుగు నెలల



కాంగ్రెస్ పాలనలో నానా తిప్పలు పెట్టారు. లోక్ సభ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలి' అని హరీశ్ రావు చెప్పుకొచ్చారు.

## అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులపై...

# సుప్రీం కోర్టు స్టే

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ మదర్సా బోర్డు విద్యా చట్టం–2004 సెక్యూలర్ సిద్ధాంతను, రాజ్యాంగంలోని 14 వ ఆర్టికల్ కింద ఇచ్చిన ప్రథామిక హక్కులను ఉల్లంఘిస్తోంది కనుక 'రాజ్యాంగ విరుద్ధం' అంటూ అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుపై సుప్రీం కోర్టు శుక్రవారం స్టే విధించింది. హైకోర్టు ఉత్తర్వుపై సుప్రీంకోర్టు శుక్రవారం స్టే ఇచ్చింది. తుది విచారణను జూలై రెండో వారం విచారిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి డివై. చంద్రచూడ్ నిర్ణయించారు. ధర్మాసనంలో న్యాయమూర్తులు జెబి. పార్థివాలా, మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 28(1) పూర్తిగా ప్రభుత్వ నిధులతో నిర్వహించబడే ఏ విద్యాసంస్థలో మతపరమైన బోధన అందించరాదని, ఆర్టికల్‌లో ఉపయోగించినట్లుగా 'మతపరమైన బోధన' అనే వ్యక్తీకరణను వివరించే 2002 తీర్పును సూచించిందని కోర్టు ఎత్తి



చూపింది. చట్టంలోని నిబంధనలను కొట్టివేస్తూ విద్యార్థులందరినీ రాష్ట్రానికి ఇతర ప్రాంతానికి తరలించాలని హైకోర్టు ఆదేశించింది.

# పేదలు, దళితులు, ముస్లింలకు నిలువనీడ లేకుండా చేయడమే సీఏఏ లక్ష్యం : అసదుద్దీన్ ఓవైసీ

హైదరాబాద్: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. సీఏఏను ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీలతో కలిపిచూడాలని అప్పుడే దాన్ని సరిగ్గా అర్థం చేసుకోగలమని అన్నారు. లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడిన తీరు ఇవాళ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు సీఏఏపై కేంద్రం తీరును తేటతెల్లం చేస్తున్నాయని చెప్పారు. పేదలు, దళితులు, మైనారిటీలు, ముస్లింలను భారత్‌లో చోటులేకుండా చేయడమే సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీ లక్ష్యమని అసదుద్దీన్ ఓవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇక పలు సందర్భాల్లో సీఏఏపై అసదుద్దీన్ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు రాగానే సీఏఏ నిబంధనలు వస్తాయని ఆయన ఇటీవల విమర్శించారు. పౌరసత్వ సవరణ చట్టంపై తమకు అభ్యంతరాలున్నాయని ఓవైసీ పేర్కొన్నారు. మతం ఆధారంగా కాకుండా హింసకు గురైన వారికి ఆశ్రయం ఇవ్వాలని కేంద్రానికి సూచించారు. సీఏఏ నిబంధనలను ఐదేళ్లుగా ఎందుకు పెండింగ్‌లో పెట్టారని



ప్రశ్నించారు. సీఏఏ ఇప్పుడు ఎందుకు అమలు చేస్తున్నారో కేంద్రం చెప్పాలని డిమాండ్ చేశారు. ముస్లింలే లక్ష్యంగా సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్ తెచ్చారని ఆయన ఆరోపించారు.

# బిజెపిలో చేరికపై ప్రకాష్ రాజ్ కౌంటర్!



సినీ నటుడు ప్రకాష్ రాజ్ బిజెపిలో చేరుతున్నారన్న వార్త సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది. ప్రధాని నరేంద్ర మోడీ విధానాలను తీవ్రంగా విమర్శించే ప్రకాష్ రాజ్ లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపిలో చేరుతున్నారంటూ ప్రత్యక్షమైన పోస్టులపై నెటిజన్ల నుంచి ఆశ్చర్యం వ్యక్తమైంది. అయితే ఈ వార్తలను ఖండిస్తూ ప్రకాష్ రాజ్ స్వయంగా వివరణ ఇవ్వడంతో సోషల్ మీడియా శాంతించింది. అసలు ఏం జరిగిందంటే%ꢀ%ప్రముఖ నటుడు రకాష్ రాజ్ ఈ రోజు (ఏప్రిల్ 4వ తేదీ) మధ్యాహ్నం 3 గంటలకు బిజెపిలో చేరుతున్నారంటూ గురువారం మధ్యాహ్నం 2.55 గంటలకుది స్కిన్ డాక్టర్ పేరుతో ఉన్న ఎక్స్ అకౌంట్ నుంచి ఒక పోస్టు వెలువడింది. ఈ వార్త వైరల్ కావడంతో కొన్ని గంటల్లోనే దాదాపు 10 లక్షల మంది వీక్షించారు. దీంతో ప్రకాష్ రాజ్ తనదైన శైలిలో స్పందిస్తూ మరో పోస్టు పెట్టారు. వారు ప్రయత్నించి ఉంటారని భావిస్తున్నాను. అయితే నన్ను కొనేంత సంపద(సిద్ధాంతపరంగా) తమ వద్ద లేదని గ్రహించి ఉంటారు..మీరేం అనుకుంటున్నారు ఫ్రెండ్స్ అంటూ బిజెపికి ప్రకాష్ రాజ్ చురకలు అంటించారు. కాగా..2024 ఎన్నికలలో తనను బరిలోకి దింపేందుకు మూడు రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఈ ఏడాది జనవరిలో ప్రకాష్ రాజ్ వెల్లడించారు. అయితే సిద్ధాంతాలు నచ్చి ఆ పార్టీలు తన వెంట పడడం లేదని, తాను ప్రధాని నరేంద్ర మోడీ విమర్శకుడిని కావడమే కారణమని ఆయన చెప్పారు. ఆ వలలో తాను పడబోనని 59 ఏళ్ల ప్రకాష్ రాజ్ స్పష్టం చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికలలో బెంగళూరు సెంట్రల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ప్రకాష్ రాజ్ ఓటమి పాలయ్యారు. ఈసారి మళ్లీ ఆయన ఎక్కడ నుంచి, ఏ పార్టీ తరఫున పోటీ చేస్తారో లేక ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతారో వేచి చూడాలి.

# జగన్ పై షర్మిల సంచలన వ్యాఖ్యలు

హత్యారాజకీయాలకు స్వస్తి పలికాలంటే జగన్ ను ఓడించాలని వైఎస్ షర్మిల పిలుపునిచ్చారు. హంతకులను కాపాడేందుకు జగన్ తన సిఎం పదవిని వాడుకుంటున్నారని అన్నారు. వైఎస్ఆర్ జిల్లా అమంగపల్లిలో ఆమె శుక్రవారం బస్సు యాత్రను ప్రారంభించి మాట్లాడారు. వివేకానందరెడ్డిని హత్య చేయించినవారికే మళ్లీ ఎంపీ టికెట్ ఇచ్చారని, అందుకే కడప నుంచి తాను పోటీకి దిగానని షర్మిల స్పష్టం చేశారు. హంతకులు ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టసభలకు వెళ్లకూడదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. 'ఒకవైపు రాజశేఖరరెడ్డి బిడ్డ, మరోవైపు వివేకానందరెడ్డిని హత్య చేయించిన వ్యక్తి ఉన్నారు.
ఎవరిని గెలిపించాలో ప్రజలే నిర్ణయించుకోవాలి' అని ఆమె అన్నారు. ప్రత్యేక హోదా సాధిస్తానని అధికారంలోకి వచ్చిన జగన్ ఆ తర్వాత రాష్ట్రాన్ని బిజేపికి తాకట్టు పెట్టారని షర్మిల ఆరోపించారు. రాజధాని



లేదు.. పోలవరం పూర్తి కాలేదు.. రాష్ట్రంలో అభివృద్ధే జరగలేదని అన్నారు. వైఎస్ఆర్ ఉండి ఉండే ఈపాటికి కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యేదని చెప్పారు.

# ఇక బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్

**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ గేట్లు ఎత్తడంతో బీఆర్ఎస్ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. పార్టీ కీలక నేతలు అందరూ.. ఆ పార్టీ వైపు చూస్తున్నారు. చాన్స్ ఉన్నంత వరకూ చేరిపోతున్నారు. ఎమ్మెల్యేల సంగతి చెప్పాల్సిన పని లేదు. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థిత్వాలను ఖరారు చేయాలనుకున్న వారిని మాత్రం చేర్చుకుంటున్నారు. కానీ ఎన్నికలకు ముందో.. తర్వాతో ఇరవై ఆరు మందిని చేర్చుకుని బీఆర్ఎస్ ఎల్పీ విలీనం పూర్తి చేస్తామని ఆ పార్టీ నేతలు అంటున్నారు. వారంతా ఇప్పుడు పార్టీలో చేరనప్పటికీ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కు పరోక్షంగా అయినా పని చేయడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే అందర్నీ కాంగ్రెస్ పార్టీకి వదిలేయడం ఎందుకన్న ఉద్దేశంతో.. ఇప్పుడు బీజేపీ కూడా రంగంలోకి దిగినట్లుగా తెలుస్తోంది. గ్రేటర్ లో కొంత మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునేందుకు చర్చలు ప్రారంభించినట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కారు పార్టీకి అత్యధిక స్థానాలు కట్టబెట్టింది గ్రేటర్ హైదరాబాదే. కానీ ఇప్పుడదే గ్రేటర్ నేతలు బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టం చేకూర్చబోతున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇప్పటికే హస్తం గూటికి చేరి, సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేస్తుండగా, అదే దారిలో మరికొందరు ఎమ్మెల్యేలు గోడ దూకేందుకు రెడీ అయినట్టు తెలిసింది. మాజీ మంత్రి, సీనియర్ నేత అయిన తలసాని శ్రీనివాస యాదవ్ బీజేపీ అధిష్టానంతో చర్చలు జరుపుతున్నట్టు ఒక్క సారిగా గుప్పు మంది. అంతా ఓకే అయితే ఆయన త్వరలోనే కాషాయ కండువా కప్పుకుంటారని తెలుస్తోంది. నిజానికి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాల్సి ఉంది. సికింద్రాబాద్ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ కు లక్ష ఓట్లకుపైగా మెజార్టీ రావడంతో తన కుమారుడ్ని నిలబెట్టి ఎంపీగా గెలిపించాలనుకున్నారు. దానికి తగ్గట్లుగానే ఏర్పాట్లు చేసుకున్నారు. కేసీఆర్ పుట్టిన రోజున ఘనంగా నిర్వహించారు. కానీ తర్వాత క్రమంగా పరిస్థితి అర్థం కావడంతో ఎన్నికల రేసు నుంచి తప్పుకున్నారు. హైకమాండ్ తలసానినే పోటీ చేయమని ఒత్తిడి చేసినా ఆయన అంగీకరించలేదు. చివరికి పద్మారావును అభ్యర్థిగా ఖరారు చేయాల్సి వచ్చింది. గ్రేటర్‌లో ఎటు వైపు చూసినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు.కానీ ఎక్కడా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం లేదు. కవిత అరెస్టు అయినప్పుడు జంట నగరాల్లో నిరసనలే కనిపించలేదు. చివరికి కవిత ఇంటి వద్దకు కూడా ఎమ్మెల్యేలు రాలేదు. అంబర్‌పేట, ఎల్‌బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి? అధికార కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లుగా చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఇక మల్లారెడ్డి సంగతి చెప్పాల్సిన పని లేదు. వీరు ఎప్పుడైనా పార్టీ మారే అవకాశం లేకపోలేదని బీఆర్ఎస్ నేతలే చెప్పుకుంటున్నారు. వీరిలో కొంత మంది బీజేపీలో చేరిన ఆశ్చర్యం లేదన్న చర్చ కూడా జరుగుతోంది. మైనంపల్లి హన్మంతరావు .. బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు కొంత మంది ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉన్నారు. వారిపైనా అనుమాన మేఘాలు కమ్ముకుంటున్నాయి. క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని పోగొట్టి, వారిలో ఉత్సాహాన్ని నింపేందుకు 'ఎండిపోయిన పొలాల' బాట పట్టారు. ఈ కార్యక్రమం ద్వారా జనంలోకి వెళ్లేందుకు, పనిలో పనిగా లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని కూడా షురూ చేసేందుకు ఆయన నిర్ణయించుకుని, దాన్ని అమలు చేస్తున్నారు. అయినా నాయకులు, ప్రజా ప్రతినిధుల గోడ దూకుడుకు ఆయన అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'ఒకరిని బుజ్జగించే సరికి?నలుగురు జారుకుంటున్న దుస్థితి?' ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను వెంటాడుతున్న సమస్య ఇది. ఉద్యమ సమయంలోనూ, అటు తర్వాత పదేండ్ల ఏలుబడిలో గులాబీ బాస్ కేసీఆర్ వేసిన ఎత్తుగడలు, పన్నిన వ్యూహాలు ఇప్పుడు పని చేయటం లేదనే వాదనలు వినబడుతున్నాయి. ఆ జిల్లా, ఈ జిల్లా అనే తేడా లేకుండా నేతలందరూ బీఆర్ఎస్‌కు బై..బై?చెబుతుండటంతో పార్టీలో ఎవరుంటారో..? ఎవరు పోతారో?? తెలియని అయోమయం నెలకొందని మొదటి నుంచి ఉద్యమ పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నాయకులు వాపోతున్నారు. గతంలో టిక్కెట్ ఇవ్వకపోతేనో లేక తనకు నచ్చిన వారికి, పార్టీలోని ప్రత్యర్థులకు టిక్కెట్ ఇస్తేనో అలగటం, కార్యక్రమాలకు రాకుండా ఉండటం లేదంటే రాజీనామా చేయటం లాంటి నిరసన కార్యక్రమాలు లీడర్ల నుంచి ఎదురయ్యేవి. ప్రతీ పార్టీలోనూ ఇవి సహజం. కానీ ఇందుకు భిన్నంగా ఇప్పుడు కారు పార్టీలో ప్రజా ప్రతినిధిగా గెలిచినా, టిక్కెట్ ఇచ్చినా ఉండని పరిస్థితి. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉదంతాలే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణలు. మరోవైపు మొన్నటిదాకా ప్రగతి భవన్ చుట్టూ ప్రదక్షిణలు చేసిన సీనియర్లలో చాలా మంది ఇప్పుడు పార్టీ కార్యాలయమైన తెలంగాణ భవన్ వైపు కన్నెత్తి కూడా చూడకపోవటం గమనార్హం. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కార్పొరేషన్ చైర్మెన్లుగా ఉన్న వారిలో అత్యధిక మంది ఇప్పుడు పార్టీకి ముఖం చాటేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కార్యకర్తలు, నాయకుల గోడ దూకుళ్లను ఆపేందుకు కేసీఆర్ వ్యూహాలు ఏ మాత్రం వర్కవుట్ కావడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే పార్లమెంట్ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ఊహించనంత గడ్డు పరిస్థితికి వెళ్లిపోతుందన్న ఆందోళన ఆ పార్టీ క్యాడర్ లో వ్యక్తమవుతోంది.

# సాగర్ ఆయకట్టులో లిఫ్ట్ లను నడిపి పంటలను కాపాడండి : జగదీష్ రెడ్డి

సాగర్ ఆయకట్టులో వెంటనే లిఫ్ట్ లను నడిపించి ఎండిపోతున్న పండ్ల తోటలను రక్షించాలని మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మిర్యాలగూడలో మీడియా సమావేశంలో మాట్లాడిన జగదీష్ రెడ్డి, ఎడమ కాలువ పరిధిలోలిఫ్టులు, తూముల ద్వార యుద్ధ ప్రాతిపదికన చెరువులను నింపాలన్నారు. నీరు లేక ఎండిపోతున్న లక్షల ఎకరాల పండ్ల తోటలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాగర్ జలాశయంలో నీరు ఉన్నా, వాటిని ఉపయోగించుకోకుండా రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా కూడా నీళ్లు ఇవ్వకుండా రైతుల పొలాలను ఎండబెట్టిందన్నారు. కాళేశ్వరం పైచెడు ప్రచారం చేసి, విధి లేని పరిస్థితుల్లో నిన్న మొన్న మోటార్లను ఆన్ చేసి హడావుడిగా నీళ్లు వదిలారని,అప్పటికే పొలాలన్నీ నిలువైన ఎండిపోవడం తో లాభం లేకుండా పోయిందన్నారు. ప్రతిపక్ష పార్టీగా రైతుల తరఫున పోరాటం మొదలుపెట్టాం అన్న జగదీష్ రెడ్డి, స్వయంగా కేసీఆర్ రంగంలోకి దిగారన్నారు..ప్రభుత్వం మెడలు వంచేదాకా మా పోరాటం ఆగదన్నారు.. రేపు అన్ని నియోజకవర్గాల్లో నిరసన దీక్ష చేస్తున్నాం అన్నారు.ఎస్ ఎల్ బి సి కింద కూడా నీటి విడుదల చేసి చెరువులను నింపాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ప్రాజెక్టుల్లో నీటిని సద్వినియోగం చేసుకునే తెలివి కూడా ఈ ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. అవగాహన రాయిత్యంతో నిర్లక్ష్యంతో పాలన చేస్తున్నారని విమర్శించారు..కరెంటును కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్న జగదీష్ రెడ్డి,.

## 7, 8 తేదీల్లో వానలు

**హైదరాబాద్:** భానుడి ఉగ్రరూపంతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫిబ్రవరి చివరి మాసం నుంచే ఎండల తీవ్రత ఉండగా... ఏప్రిల్ ఎంట్రీ కావటంతో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటిపోయాయి. రాబోయే రోజుల్లో మరింత ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. అత్యవసర పనులు అయితే తప్పా... మధ్యాహ్నం సమయంలో అసలు బయటికి వెళ్లవద్దని సూచిస్తున్నాయి. మరోవైపు వడగాల్పుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుంది. చాలా మండలాల్లో వడగాల్పులు వీస్తున్నాయి. ఫలితంగా వడదెబ్బ కేసులు కూడా పెరుగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే.... తెలంగాణకు చల్లని కబురును మోసుకొచ్చింది వాతావరణశాఖ. ఓవైపు మండుతున్న వేసవితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా... తాత్కాలిక ఉపశమనం కలిగించేలా కూల్ న్యూస్ చెప్పింది. ఈ ఏప్రిల్ 7, 8 తేదీల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను కూడా జారీ చేసింది. ఈ మేరకు తాజా బులెటిన్ ను విడుదల చేసింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం( తాజా బులెటిన్ ప్రకారం... ఏప్రిల్ 7వ తేదీన తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడకక్కడ కురిసేఅవకాశం ఉందని పేర్కొంది. అయితే ఏప్రిల్ 8వ తేదీన పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడొచ్చని తెలిపింది. గాలి వేగం గంటకు 30- 40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని వివరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. ఇక ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 08.30 గంటల లోపు పలు ప్రాంతాల్లో కూ?డా వర్షాలు పడొచ్చని వెల్లడించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్ల, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఏప్రిల్ 10వ తేదీన తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు అక్కడకక్కడ కురిసే ఛాన్స్ ఉందని ఓ ప్రకటనలో వివరించింది.తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చి నెల నుంచి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదవుతోంది. మార్చిలో మధ్య వాతావరణం సాధారణ స్థితికి చేరినా చివరి వారం నుంచి అధిక ఉష్ణోగ్రతలుకొనసాగాయి. ఏప్రిల్ నాటికి అవి మరింత పెరిగాయి. పగటి ఉష్ణోగ్రతల పెరుగుదలతో పాటు రాత్రి పూట ఉక్కపోత ప్రజల్ని వేధిస్తోంది. ఏసీలు, కూలర్లకు డిమాండ్ పెరిగింది. దేశ వ్యాప్తంగా వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యే రాష్ట్రాల్లో ఏపీ తెలంగాణలు కూడా ఉన్నాయని ఇప్పటికే ఐఎండి ప్రకటించింది. గత ఏడాది కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయనే హెచ్చరికలతో జనం బెంబేలెత్తి పోతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అధిక ఉష్ణోగ్రతలతో హెచ్చుతగ్గులు కూడా అధికంగా నమోదైనట్లు అమెరికన్ వాతావరణ అధ్యయన సంస్థ క్లైమేట్ ప్రకటించింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఏపీ, తెలంగాణల్లో వాతావరణాల్లో వస్తున్న మార్పులను విశ్లేషించారు. 1970 జనవరి 1 నుంచి 2023 జూన్ 30వరకు 53ఏళ్ల పాటు దేశంలో ఉష్ణోగ్రతలలో వచ్చిన మార్పులను అత్యాధునికి పద్ధతుల్లో విశ్లేషించారు. ఈ అధ్యయనంలో దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఏటా ఏప్రిల్ – జూన్ మధ్య కాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. యాభై ఏళ్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. యాభై ఏళ్ల క్రితంతో పోలిస్తే తెలంగాణలో సగటు ఉష్ణోగ్రత 0.5డిగ్రీలు పెరిగింది. ఏపీలో 0.9డిగ్రీలు పెరిగింది. దేశంలో వేగంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న రాష్ట్రాల్లో ఏపీ 15వ స్థానంలో తెలంగాణ 28వస్థానంలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.

## బీరు.. ఫుల్ డిమాండ్

**హైదరాబాద్:** సమ్మర్ వచ్చిందంటే చాలు.. కూల్ కూల్ ఐస్ క్రీంలు, కూల్ డ్రింకులకు ఎంత డిమాండ్ ఉంటుందో.. అంతకు రెట్టింపు డిమాండ్ బీర్లకు ఉంటుంది. సాధారణంగా మద్యం ప్రియుల్లో ఒకరికి విస్కీ ఇష్టమైతే మరొకరికి బ్రాందీ నచ్చుతుంది.. ఇంకొకరికి వొడ్కా నచ్చుతుంది. ఇలా ఒక్కొక్కరికీ ఒక్కో రకం ఇష్టముండగా.. వేసవి వచ్చేసరికి మాత్రం మద్యంప్రియులంతా చల్లచల్లని బీర్లకే జై కొడుతుంటారు. ఏ చిన్న అకేషన్ వచ్చినా కాటన్లు కాటన్లు బీర్లు ఖాళీ చేసేస్తుంటారు. బయట ఎండలు మండిపోతుంటే.. లోపల ఓ చల్లని బీరేస్తే ఉంటది నా సామిరంగా అంటూ మద్యంప్రియులు మిగతావారికి కూడా నోరూరిస్తూంటారు. అయితే.. ఇప్పుడు మద్యం ప్రియులకు బ్యాడ్ న్యూస్ వినిపించింది. ఈ వేసవిలో బీర్లు వేస్తూ చిల్ అయ్యే ఛాన్స్ మందుప్రియులకు దొరకటం కష్టంగా మారనున్నట్టు తెలుస్తోంది.ఇప్పటికే మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలోని మద్యం డిపోకు బీర్ల సరఫరా చాలా వరకు నిలిచి పోయింది. వచ్చిన నిల్వలను డిపో పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లకు రేషియో పద్ధతిన సరఫరా చేస్తుంటారు. ఇప్పటికే బీర్ల కొరత ఏర్పడగా.. కొద్ది రోజుల్లో మరింత తీవ్రం కానున్నట్లు అంచనా వేస్తున్నారు. గతంలో పలు కంపెనీలు సర్కార్ లిక్కర్ గోదాంలకు సరఫరా చేసిన బీరు నిల్వలకు ఇప్పటికీ బకాయిల చెల్లించలేదని.. అందులో ఇప్పుడు కొత్తగా సరుకు రావటల్లేదని చెప్తున్నారు.గుడిపేట లిక్కర్ డిపో పరిధిలో మొత్తం 135 మద్యం దుకాణాలు, 28 వరకు బార్లు ఉన్నాయి. సమ్మర్ సమయంలో వీటిల్లో పెద్దఎత్తున బీర్ల అమ్మకాలు సాగనున్నాయి. గతేడాది మార్చిలో సుమారు 2 లక్షల వరకు బీర్ల కేసులు అమ్మినట్టు లెక్కలు చెప్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో 1.80 లక్షల వరకు బీరు కేసులు మాత్రమే అమ్మకాలు జరిగాయి. గత ఏడాది బీరు కేసులు మద్యం దుకాణాల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా జరిగి డిపోలో లక్షల కేసుల నిల్వలు ఉండేవి. ఇప్పుడు బీరు కేసులు వచ్చినవి వచ్చినట్లు విక్రయిస్తుండగా.. డిపోలో నిల్వలు ఉండడం లేదు. ఈ లెక్కన డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేదని తెలుస్తోంది.

# నిజంగా ప్రజాస్వామ్యానికి అంతిమ ఘడియలా...?



అభ్యర్థుల ఎంపికలు ఇప్పుడిప్పుడే పూర్తవుతున్నాయి. అసంతృప్తుల బుజ్జగింపులు కొనసాగుతున్నాయి. 'నేను కొన్ని దశాబ్దాలుగా నా నియోజకవర్గంలో పనిచేస్తున్నాను. కాని ఉన్నట్లుండి బయటనుంచి ఒక వ్యక్తిని తీసుకువచ్చి ఆయనను ఎంపిక చేశారు. రాజకీయాల్లో డబ్బు, కులం ఆధిపత్యం పెరిగిపోయింది' అని ఒక సీనియర్ రాజకీయ నాయకుడు వాపోయారు. ఎన్నో ఆశలు పెట్టుకుని పలు ప్రయత్నాలు చేసుకున్న వివిధ సామాజిక వర్గాలు నిరాశ చెందినట్లు కనిపిస్తున్నాయి. తమను ఉపయోగించుకోవడమే కాని, తమకు నిజమైన సామాజికాధికారం కల్పించే ఉద్దేశం ఎవరికీ లేదని పలువురు బడుగు, బలహీన వర్గాల నేతలు ఢిల్లీ దాకా వచ్చి మీడియాకు చెప్పుకుంటున్నారు. ఈ రణగొణ ధ్వనులు అన్ని పార్టీల్లో ఉన్నాయి. జీవితంలో ఒక్కసారి కూడా కాంగ్రెస్, బీజేపీ కార్యాలయాలు చూడని వారు ఆయా పార్టీల నాయకులుగా రాత్రికి రాత్రి అవతరిస్తున్నారు. ఇప్పుడు ఏ పార్టీలో అతి సామాన్యులు లేరనే చెప్పాలి. అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ ప్రకారం గత లోక్?సభ ఎన్నికల్లో 25శాతం మంది ఎంపీలు వంద కోట్లకు పైగా ఆర్జించిన సంపన్నులైతే బీజేపీలో ప్రతి పదిమందిలో 9 మంది కోటీశ్వరులే. ఈడీ నిజాయితీగా పనిచేస్తే ఇవాళ దేశంలో సగానికిపైగా రాజకీయ నాయకులు కటకటాలు లెక్కపెట్టవలసి వస్తుందని ఒక పార్టీ నేత చెప్పారు. రాజకీయ పార్టీల్లో ఇన్ని లోపాలు ఉన్నప్పటికీ దేశంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న కొద్దీ లోక్?సభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు అన్న ఉత్కంఠ ఉండనే ఉంటుంది. 'ఇందులో ఉత్కంఠ ఏముంది? నరేంద్ర మోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీని ఢీకొనగల శక్తి దేశంలో ఎక్కడుంది? ఆయన మూడోసారి గెలిచే విషయంలో ఎలాంటి అనుమానం లేదు' అని వ్యాఖ్యానించేవారు ఎక్కువగా ఉన్నారు. వీరు అసలు మోదీ మరోసారి విజయం సాధిస్తారా లేదా అన్న చర్చకే తావులేదని కొట్టి పారేస్తున్నారు. మోదీ కూడా ఇప్పటికే గెలిచానన్నట్లుగా మాట్లాడుతున్నారు. జూన్‌లో మరోసారి అధికారం చేపట్టిన తర్వాత వందరోజుల్లో తాను చేపట్టే కార్యక్రమాల గురించి ఇప్పటి నుంచే చెప్పుకుంటున్నారు. 'గత పదేళ్లలో జరిగింది ట్రెయిలర్ మాత్రమే. ఇంకా చాలా చేయాల్సి ఉన్నది' అని మోదీ మంగళవారం రాజస్థాన్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రకటించారు. మోదీ ఈ మాటలే ప్రతిపక్షాల్లోనూ, అనేకమంది ఇతర వర్గాల్లోను వణుకు పుట్టిస్తోంది. బహుశా బీజేపీలో కూడా ఈ విషయంపై అంతర్గత చర్చ జరుగుతున్నట్లు కనిపిస్తోంది. 'రెండు సార్లు గెలిస్తేనే మోదీ ఇంత బీభత్సం సృష్టించారు. ఇక మూడోసారి ఆయన గెలిస్తే గాలి కూడా స్తంభించిపోతుందేమో' అన్న భయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష నేతల్ని జైలుకు పంపి, ఈడీ, ఐటీ సమన్లు, దర్యాప్తులతో, ఖాతాల స్తంభనతో వేధిస్తూ ఎన్నికల్లో విజయం సాధించడం ఒకరకంగా మాచ్ ఫిక్సింగ్‌తో సమానమని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. 'ఇవి సాధారణ ఎన్నికలు కావు. బీజేపీ గెలిస్తే రాజ్యాంగమే మారిపోతుంది. దేశాన్ని కాపాడి, రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి' అని రాహుల్ గాంధీ రెండు రోజుల క్రితం రామ్ లీలా మైదాన్‌లో జరిగిన బహిరంగ సభలో అన్నారు. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే ఇక దేశంలో ప్రజాస్వామ్యాన్ని మరిచిపోవాల్సిందేనని ఇదే సభలో మాట్లాడిన దాదాపు 27 మంది ప్రతిపక్ష నేతలు అభిప్రాయపడ్డారు. 'కృష్ణుడు కంసుడిని వధించకపోతే, కంసుడే కృష్ణుడిని వధించేవాడు' అని ఒక ప్రవచన కర్త అన్నట్లుగా, రాజకీయాల్లో నేతలు ఎదురు దెబ్బలను తట్టుకుని నిలదొక్కుకోకపోతే ఇతరులు వారి భౌతిక కాయాలపై నడుచుకుంటూ వెళతారు. ఈ రీత్యా రాంలీలామైదాన్‌లో జరిగిన బహిరంగ సభను చూస్తే ప్రతిపక్షాలు కాడిని పడేయలేదని స్పష్టమువుతోంది. గత మూడునెలల్లో ప్రతిపక్షాలను కకావికలం చేసే అనేక ప్రయత్నాలు జరిగాయి. ఇండియా కూటమి నుంచి జనతాదళ్ (యు) నేత నితీష్ కుమార్ తప్పుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తానని ప్రకటించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు జైలుకు వెళ్లారు. రాజ్యసభ ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలను బీజేపీ తమ వైపుకు తిప్పుకుంది. ఆరుగురు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కొనఊపిరితో ఉన్నది. ఒక దిగ్బంధన వాతావరణంలో ప్రతిపక్షాలు అరివీర భయంకరుడైన మోదీని ఎదుర్కొనగలవా అన్న అనుమానాలు అంతటా నెలకొనడంలో ఆశ్చర్యం లేదు. ఈ పరిస్థితుల్లోనూ ప్రతిపక్షాలు చివరి పోరాటానికి సిద్ధపడినట్టే కనపడుతోంది. మార్చి 3న బిహార్‌లోని పట్నాలోని చరిత్రాత్మక గాంధీ మైదానంలో భారీ ఎత్తున జరిగిన జన విశ్వాస్ ర్యాలీ హిందీ బెల్ట్‌లో ప్రతిపక్షాల ఐక్యతను ప్రతిఫలించింది. ఆ తర్వాత మార్చి 17న రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా ముంబైలోని శివాజీ పార్క్‌లో జరిగిన ర్యాలీ, తాజాగా కేజ్రీవాల్, హిమంత్ సోరెన్ అరెస్టుని నిరసిస్తూ ఢిల్లీలో జరిగిన ర్యాలీ కూడా ప్రతిపక్షాల సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నాయి. ఇది మంచి పరిణామమే. అయితే 'నియంతృత్వాన్ని రూపుమాపండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని ప్రతిపక్షాలు చేస్తున్న నినాదం ఎంతవరకు ప్రజల్లో చొచ్చుకుపోతోంది? నిజంగా ప్రజాస్వామ్యానికి అంతిమ ఘడియలు దాపురించినట్లు దేశ ప్రజలంతా నమ్ముతున్నారా? నమ్మినా ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వారంతా ముందుకు వస్తారా? నేతల అరెస్టులు ప్రజల్లో ఎంత మేరకు సానుభూతిని కల్పిస్తాయి? అన్న ప్రశ్నలు వేసుకోవాల్సి ఉన్నది. 1977లో వివిధ పార్టీలు జనతా పార్టీ పేరిట ఏకమై 43.2 శాతం ఓట్లతో ఘనవిజయం సాధించిన నాటి పరిస్థితులు దేశంలో ఏర్పడేలా చేయగలిగిన శక్తి నేటి ప్రతిపక్షాలకు ఉన్నదా అన్నది చర్చనీయాంశం. నిజానికి ప్రతిపక్షాలకు సంఘటితం కాగలిన, ప్రజలను చైతన్యం చేయగలిగిన నైతిక శక్తి ఉంటే విజయం సాధించడం పెద్ద కష్టం కాదు. గత ఎన్నికల్లో బీజేపీకి కేవలం 37.36శాతం ఓట్లు మాత్రమే లభించాయి. మిగతా 63 శాతం ఓట్లు ప్రతిపక్షాల ఓట్లుగా, సీట్లుగా ఎందుకు మారలేకపోయాయి? ఇది ఓటర్ల వైఫల్యం కానే కాదు. దేశంలో ప్రతిపక్షాల, ప్రత్యామ్నాయ శక్తుల వైఫల్యం. సిద్ధాంత రాహిత్యాల, భావ దారిద్ర్యాల ఫలితం. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మోదీ అనుసరిస్తున్న విధానాలను దేశంలో ప్రతిపక్షాలు, ఇతర చెదురుమదురు వర్గాలు మాత్రమే కాక ప్రపంచంలో పలు దేశాలు విమర్శిస్తున్నాయి. మోదీకి నీరాజనాలు పట్టిన అమెరికా కూడా రాజకీయ ప్రత్యర్థులపై వచ్చిన ఆరోపణలను పారదర్శకంగా, నిజాయితీగా, న్యాయపూరితంగా విచారించాలని ఆశించింది. జర్మనీ కూడా స్వతంత్ర న్యాయ వ్యవస్థకు ఉండాల్సిన ప్రమాణాలు, కనీస ప్రజాస్వామిక సూత్రాలు పాటించాలని ఆశించింది. ఇదే అమెరికా, జర్మనీ గత ఏడాది జీ–20 సమావేశాల్లో మోదీని ఆకాశానికి ఎత్తిన విషయం మరిచిపోరాదు. దేశ రాజధానిలో ఉండే రాయబార కార్యాలయ ప్రతినిధులే కాదు, ప్రతి విదేశీ మీడియా ప్రతినిధి జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నారు. మోదీకి ఉన్నత వర్గాల్లో ఆదరణ ఉన్నదని చెబుతూనే కేజ్రీవాల్ అరెస్టు ప్రజాస్వామ్యంపై మచ్చలాంటిదని 'ద ఎకనామిస్ట్' వ్యాఖ్యానించింది. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలపై విరుచుకుపడడం అప్రజాస్వామికమని అనేక విదేశీ పత్రికలు విమర్శించాయి. 'ప్రతి ఒక్కరి రాజకీయ, పౌర హక్కులను పరిరక్షించాలి. ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరిగే వాతావరణంలో ప్రజలు ఓటు వేయగలగాలి' అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ నజరల్ ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు.

## రిజిస్ట్రేషన్ల ఆదాయం 1099.02 కోట్లు

### ఉమ్మడి జిల్లా పరిధిలో 16 సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు




**సంగారెడ్డి :** వరుస ఎన్నికలు.. కోడ్ ఉన్నా రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగుతున్నది. ఆ శాఖ ద్వారా రాష్ట్ర ఖజానాకు వచ్చే రాబడి భారీగా పెరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. గత మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన ఆదాయం రూ.156.15 కోట్లు పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1,20,301 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.942.87 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే ఆ వెంటనే 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,28,124 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు 1099.02 కోట్ల రాబడి వచ్చి చేరింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఆదాయం గణనీయంగా తగ్గింది. కొత్తగా ఏర్పడిన పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ పరి?ధిలో మాత్రం భారీగా ఆదాయం సమకూరింది. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 16 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. లవీటిలో పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం గతేడాది కొత్తగా ఏర్పాటైంది. అంతకుముందు వరకు పటాన్‌చెరు నియోజకవర్గం.. సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో కొనసాగింది. పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్ మండలాలతో కొత్తగా పటాన్‌చెరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటైనా.. సంవత్సరం నుంచి సంగారెడ్డి కార్యాలయంలోనే ప్రత్యేకంగా కొనసాగుతుండడం గమనార్హం. 2022-23 ఆర్థిక సంవత్సరం పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో గజ్వేల్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో ఆదాయం గణనీయంగా తగ్గింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో 12,957 ఆస్తుల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.58.88 కోట్ల ఆదాయం వచ్చింది. కానీ గత మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 2,117 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు తగ్గడంతో 39.29 శాతం మేర ఆదాయం తగ్గింది. రూ.35.74 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. అదే సమయంలో దుబ్బాక సబ్‌రిజిస్ట్రార్ పరి?ధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రాబడి పెరిగింది. ఈ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,272 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 3.18 కోట్ల ఆదాయం వచ్చింది. అయితే, 2023-24 సంవత్సరంలో 342 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు పెరగడంతో రాబడి 48.12 శాతం మేర పెరిగింది. అదనంగా రూ.4.71 కోట్లు ఖజానాకు చేరాయి. పటాన్‌చెరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధి అంతా హైదరాబాద్ శివారు ప్రాంతంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రాంతాలే. ఈ ప్రాంతాలలో ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ ధర చ.గ.కు రూ. వేలల్లో ఉన్నది. పైగా ఈ ప్రాంతలో ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోళ్లు ఎక్కువ సంఖ్యలోనే జరుగుతుంటాయి. ఈ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోనే ఔటర్‌రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న తెల్లాపూర్, కొల్లూరు, ఉస్మాన్‌నగర్, పాటి తదితర గ్రామాలలో నిర్మాణమవుతున్న అపార్ట్‌మెంట్ల సంఖ్య వందల్లో ఉన్నాయి.

## పంచాయతీల పన్ను వసూళ్లలో అగ్రస్థానం...!

**జగిత్యాల :** గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరైన పన్నుల వసూళ్లలో జగిత్యాల జిల్లా పంచాయతీ అధికా రులు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలో 98.3 శాతం పన్ను వసూళ్లతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. అదే సమ యంలో రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా, నారాయణ పేట జిల్లాలు సై తం 98 శాతం పూర్తి చేసి అగ్రస్థానంలో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2023 -24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను వసూళ్లను ప్రత్యేకంగా నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు జిల్లాలో రూ. 12.51 కోట్లు వసూళ్లు జరిపి ఉన్నతాధికారులచే శభాష్ అనిపించుకుంటున్నారు. జిల్లాలోని మేడిపల్లి మండలంలోని 25 గ్రామ పంచాయతీలు వంద శా తం పన్ను వసూళ్లను పూర్తి చేసి ముందంజలో ఉన్నాయి. గత యే డాది లక్ష్యంలో వందశాతం వసూలు చేశారు. ఈ ఏడాది సైతం వంద శాతం వసూలు అయ్యేలా సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లు జరపడానికి ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 12.79 కోట్ల పన్ను వసూలు చేయాలన్న లక్ష్యం ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ. 12.51 కో ట్లు పన్ను వసూలు అయింది. ఇంకా జిల్లాలో రెండు శాతం పన్ను వసూలు చేయాల్సి ఉంది. పన్ను వసూలులో మేడిపల్లి మండలం 100 శా తం వసూలు చేసి అత్యధికంగా ఉండగా, బుగ్గారం, ఇబ్రహీంపట్నం మం డలాలు 94 శాతం వసూలు చేసి అత్యల్పంగా ఉంది. సాధ్యమైనంత తొం దరలో వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలన్న దిశగా అధికారులు ప్రయ త్నాలు చేస్తున్నారు. రెండు, మూడు మాసాలుగా ఆస్తి పన్ను వసూళ్లను పంచాయతీ కార్య దర్శులు ముమ్మరం నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లాలో 98.3 శాతం వసూలు చేశారు. వందశాతం వసూలు అయ్యేలా అధికారులు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఆయా గ్రామాల్లో కార్యదర్శులు కార్యాలయాల్లో ప న్ను వసూలు చేయడంతో పాటు ఇంటింటికి తిరిగి వసూలు చేస్తున్నారు. జిల్లాలోని బీర్‌పూర్ మండలంలో 99 శాతం, ధర్మపురిలో 99, గొల్లపల్లిలో 98, ఇబ్రహీంపట్నం 94, మేడిపల్లి 100, జగిత్యాల 95, జగిత్యాల రూరల్ 98, కథలాపూర్ 97, కొడిమ్యాల 97, కోరుట్ల 98, మల్లాపూర్ 97, మల్యాల మండలంలో 98 శాతం వసూళ్లు అయ్యాయి. మెట్‌పల్లిలో 99, పెగడపల్లి 99, రాయికల్ 99, సారంగపూర్ 98, వెల్గటూరు మండలంలో 99 శాతం పన్ను వసూళ్లు అయ్యాయి.

# ఇజ్రాయిల్ మారణహోమం!

గాజాలో పాలస్తీనియన్లపై మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్ మొత్తం మధ్యప్రాచ్యం, పశ్చిమాసియాను రణరంగంగా మార్చాలని చూస్తున్నది. ఏప్రిల్ ఒకటవ తేదీన సిరియా రాజధాని డమాస్కస్ లోని ఇరాన్ కాన్సులేట్ భవనంపై దాడి చేసి పన్నెండు మందిని బలిగొనటమే దానికి పక్కా తార్కాణం. ఇద్దరు సీనియర్ కమాండర్లు, మరో ఐదుగురు మిలిటరీ సలహాదారులు, ఐదుగురు సిరియన్ పౌరులు ఆ దాడిలో మరణించారు. దీనికి బాధ్యురాలైన ఇజ్రాయిల్‌తో పాటు దాని వెనుక ఉన్న అమెరికా మీద కూడా తగిన చర్య తీసుకుంటామని ఇరాన్ ప్రకటించింది. ఆక్రమిత గోలన్ గుట్టల నుంచి ఎఫ్–35 యుద్ధ విమానాలతో ఆరు క్షిపణులను ప్రయోగించింది. ఒక దౌత్య కార్యాలయం మీద దాడి చేయటం అన్ని రకాల నిబంధనలు, సాంప్రదాయాలను ఉల్లంఘించటం తప్ప మరొకటి కాదు. ఆ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని, దాడికి వెళుతూ అస్పష్టంగా ఇజ్రాయిల్ ఉప్పందించింది తప్ప వివరాలు చెప్పలేదని అమెరికా బుకాయించింది తప్ప దాడిని ఖండించకపోగా, దాడితో సంబంధం ఉందని చెప్పి తమపై దాడులకు దిగితే ప్రతిదాడులు చేస్తామని బెదిరింపులకు దిగింది. రష్యా కోరికపై మంగళవారం సాయంత్రం భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిపింది. ప్రతిదాడులు జరిపేందుకు తమకు హక్కు ఉందని ఇరాన్ ఈ సమావేశంలో స్పష్టం చేసింది. ఒక దేశ రాయబార కార్యాలయం మీద దాడి జరపటం అంటే ఆ దేశం మీద దాడిగానే చూస్తారు. అమెరికా దన్నుతో తెగబడుతున్న ఇజ్రాయిల్ ఒకవైపు ఇరుగు పొరుగు దేశాల మీదనే కాదు గాజాలో మానవతాపూర్వక సాయం అందిస్తున్న విదేశీయుల మీద కూడా దాడులు చేసి చంపివేస్తున్నది. దాని చర్యల మీద ప్రపంచమంతటా తీవ్ర నిరసన వెల్లడి అవుతున్నది. హమాస్ తీవ్రవాదుల అణచివేత ముసుగులో ఆసుపత్రులను కూడా వదలకుండా దాడులు చేస్తున్నది. అక్టోబరు ఏడు నుంచి ఇప్పటి వరకు 33 వేల మంది ప్రాణాలు తీసింది, లక్షలాది మందిని గాయపరచింది. గాజాలోని నివాసాలన్నింటినీ నేలమట్టం గావిస్తున్నది. గాజా పౌరుల మీద జరుపుతున్న మారణకాండకు వ్యతిరేకంగా హైతీ, హిజబుల్లా సాయుధులు ఎర్ర సముద్రం నుంచి ఇజ్రాయిల్ వైపు ప్రయాణించే ఓడలు, ఇజ్రాయిల్ మీద దాడులు జరుపుతున్నారు. గాజా మారణకాండను తక్షణమే నిలివివేయటం, పాలస్తీనా స్వతంత్ర రాజ్యాన్ని పునరుద్ధరించటం తప్ప మరో పరిష్కార మార్గం లేదు. అందుకు సిద్ధంగాని అమెరికా ఆ ప్రాంతంలో చిచ్చు రేపేందుకు కుట్రలు చేస్తున్నది. దానిలో భాగమే ఇరాన్ రాయబార కార్యాలయంపై దాడి. ఇది ఇరాన్ మీదనే కాదు, సిరియా సార్వభౌమత్వం మీద కూడా దాడిగానే ప్రపంచం చూస్తున్నది. ఉద్రిక్తతలను మరింత పెంచేందుకు తప్ప తగ్గించేందుకు ఇలాంటి చర్యలు తోడ్పడవు. అమెరికా, పశ్చిమ దేశాలు ఎందుకీ కుట్రలకు పాల్పడుతున్నాయన్నది ప్రశ్న. చర్యకు ప్రతి చర్య లేకపోతే సామ్రాజ్యవాదులను నిలువరించటం కష్టం. రెండు ప్రపంచ యుద్ధాలు సామ్రాజ్యవాదుల మధ్య ప్రపంచాన్ని పంచుకొనే క్రమంలో వచ్చిన పేచీలతోనే జరిగాయి. ఆ రెండు యుద్ధాలలో పరస్పరం తలపడిన సామ్రాజ్యవాదులు ఇప్పుడు రాజీపడి ఏకమయ్యారు. తమను ప్రతిఘటిస్తున్నవారిని సహించలేకపోతున్నారు. కీలకమైన మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాలో అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాదులకు చైనా, రష్యా, ఇరాన్ దగ్గర కావటం మింగుడుపడటం లేదు. ఓమన్ గల్ఫ్‌లో ఈ మూడు దేశాల నౌకాదళాలు సంయుక్తంగా సముద్ర భద్రత (మెరైన్ సెక్యూరిటీ బెల్ట్ 2024) పేరుతో భారీ విన్యాసాలు జరుపుతున్నాయి. వీటిలో రష్యా నుంచి వచ్చిన రెండు విమాన వాహక యుద్ధ నౌకలతో పాటు మూడు దేశాలకు చెందిన ఇరవై ఆధునిక యుద్ధ నౌకలు ఉన్నాయి. రాత్రి, పగలు నిర్వహించే విన్యాసాలలో ఉపరితల, గగనతల లక్ష్యాలను చేరుకొనే ఆయుధ ప్రయోగాలు జరుపుతారు. వీటికి పాకిస్తాన్, భారత్, కజకస్తాన్, అజర్‌బైజాన్, ఓమన్, దక్షిణాఫ్రికా నౌకాదళాల ప్రతినిధులు పరిశీలకులుగా ఉన్నారు. ఇవి 2019 నుంచి ఏటా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంతో, ఖండంతో సంబంధం లేని నాటో దేశాల కూటమి వీటికి పోటీగా ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన మూడు దశాబ్దాల తరువాత తొలిసారిగా ఈ ప్రాంతంలో విన్యాసాల పేరుతో బల ప్రదర్శన జరపనుంది. ఈ పరిణామాలను విడివిడిగా చూడలేము. అందుకే మధ్య ప్రాచ్యంలో మారణహోమానికి అమెరికా కూటమి తెర తీస్తున్నదని, దానిలో భాగంగానే ఇరాన్‌పై దాడి అని చెప్పాల్సి వస్తోంది. ఒక దౌత్య కార్యాలయం మీద దాడి చేయటం అన్ని రకాల నిబంధనలు, సాంప్రదాయాలను ఉల్లంఘించటం తప్ప మరొకటి కాదు. ఆ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని, దాడికి వెళుతూ అస్పష్టంగా ఇజ్రాయిల్ ఉప్పందించింది తప్ప వివరాలు చెప్పలేదని అమెరికా బుకాయించింది తప్ప దాడిని ఖండించకపోగా, దాడితో సంబంధం ఉందని చెప్పి తమపై దాడులకు దిగితే ప్రతిదాడులు చేస్తామని బెదిరింపులకు దిగింది. రష్యా కోరికపై మంగళవారం సాయంత్రం భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిపింది. ప్రతిదాడులు జరిపేందుకు తమకు హక్కు ఉందని ఇరాన్ ఈ సమావేశంలో స్పష్టం చేసింది. ఒక దేశ రాయబార కార్యాలయం మీద దాడి జరపటం అంటే ఆ దేశం మీద దాడిగానే చూస్తారు. అమెరికా దన్నుతో తెగబడుతున్న ఇజ్రాయిల్ ఒకవైపు ఇరుగు పొరుగు దేశాల మీదనే కాదు గాజాలో మానవతాపూర్వక సాయం అందిస్తున్న విదేశీయుల మీద కూడా దాడులు చేసి చంపివేస్తున్నది. దాని చర్యల మీద ప్రపంచమంతటా తీవ్ర నిరసన వెల్లడి అవుతున్నది. హమాస్ తీవ్రవాదుల అణచివేత ముసుగులో ఆసుపత్రులను కూడా వదలకుండా దాడులు చేస్తున్నది. అక్టోబరు ఏడు నుంచి ఇప్పటి వరకు 33 వేల మంది ప్రాణాలు తీసింది, లక్షలాది మందిని గాయపరచింది.

# పెద్దపల్లిలో ఆసక్తికరంగా పోటీ

**కరీంనగర్:** తెలంగాణలో లోక్‌సభ సమరం ఆసక్తికరంగా మారుతోంది. కాకా ప్యామిలీకి కంచుకోటైన పెద్దపల్లి నియోజకవర్గంలో గత రెండుసార్లు కారు జోరు చూపింది. ఐతే ఈ సారి కారుకు బ్రేక్‌లు వేసేలా కాకా మనవడినే రంగంలోకి దింపింది హస్తం పార్టీ. అటు బీఆర్ఎస్ కూడా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను పోటీకి పెట్టగా బీజేపీ గోమాస శ్రీనివాస్‌ను బరిలోకి దింపడంతో పోరు ఆసక్తికరంగా మారింది. ఈ సారి ఎలాగైనా హస్తం జెండా ఎగరేసి పూర్వవైభవం చాటాలనే కసితో కాంగ్రెస్ పనిచేస్తుండగా, అధికార పార్టీకి దీటుగా బీఆర్ఎస్.. మరోవైపు బీజేపీ కూడా వ్యూహప్రతివ్యూహాలతో సిద్ధమవుతున్నాయి. తెలంగాణలోని పెద్దపల్లి పార్లమెంట్ సీటుదో ప్రత్యేకత.. సింగరేణి కార్మికులు ప్రభావం ఎక్కువగా ఉండే ఈ పార్లమెంట్ సెగ్మంట్‌లో గత పదేళ్లుగా బీఆర్ఎస్‌దే హవా. ఐతే పదేళ్ల క్రితం వరకు తమ కంచుకోటగా ఉన్న పెద్దపల్లిని ఈ సారి భారీ విక్టరీతో తన ఖాతాలో వేసుకోవాలని ప్రయత్నిస్తోంది కాంగ్రెస్.. మరోవైపు బీజేపీ కూడా ప్రధాని మోదీ చరిష్మాతో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తోంది. మొత్తానికి మూడు పార్టీలు తగ్గేదేలే అన్నట్లు ఎత్తులు.. పై ఎత్తులతో రాజకీయాన్ని రక్తికట్టిస్తున్నాయి. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలో విస్తరించిన ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రామగుండం, పెద్దపల్లి, మంథని, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ధర్మపురి నియెజకవర్గాలు ఉన్నాయి. మొత్తం 15 లక్షల 94 వేల 392 ఓట్లు ఉన్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ ఏడు నియోజకవర్గాలను క్లీన్‌స్వీప్ చేసింది. మొత్తం ఏడు చోట్ల కలిపి 6 లక్షల 82 వేల 33 ఓట్లు సాధించి తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది కాంగ్రెస్. ఇక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీకి 3 లక్షల 36 వేల 374 ఓట్లు వచ్చాయి. గతంలో బీఆర్ఎస్ హవా కొనసాగిన పెద్దపల్లిలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తి రివర్స్ ఫలితాలు వచ్చాయి. ఇక ఈ సారి ఎలాగైనా గెలవాలని కలలు కంటున్న బీజేపీకి ఏడు నియోజకవర్గాల పరిధిలో కేవలం 79 వేల 418 ఓట్లు మాత్రమే వచ్చాయి. అసెంబ్లీ ఫలితాల్లో కాంగ్రెస్ ఏకపక్ష విజయాలు సాధించగా, పార్లమెంట్ ఎన్నికల నాటికి పరిస్థితుల్లో మార్పు వచ్చిందనే ఆశతో ప్రతిపక్ష పార్టీలు పోటీకి రెడీ అవుతున్నాయి. సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లో చేరగా.. సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు టికెట్ ఇచ్చింది బీఆర్ఎస్. ఇక ఎప్పటి నుంచో ఎంపీ కావాలని కలలు కంటున్న గోమాశ శ్రీనివాస్‌ను బరిలోకి దింపింది బీజేపీ. ఈ రెండు పార్టీలకు దీటుగా ఆర్థిక బలం, రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న కాకా మనవడు గడ్డం వంశీకి టికెట్ ఇచ్చింది కాంగ్రెస్. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలు ఉన్నాయి. సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులే గెలుపోటములను డిసైడ్ చేస్తారు. ప్రస్తుతం పార్లమెంట్ పరిధిలో 7 నియెజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉండడంతో ఆ పార్టీలో గెలుపు ధీమా ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో కాంగ్రెస్ దూకుడుకు కళ్లెం వేయాలని బీఆర్ఎస్ పక్కా స్కెచ్ వేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పెద్దపల్లిలో గెలవాలనే టార్గెట్‌తో సీనియర్ నేత కొప్పుల ఈశ్వర్‌కు టికెట్ ఇచ్చింది బీఆర్ఎస్. ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొప్పుల.. గత ఎన్నికల్లో అనూహ్యంగా ఓడిపోయారు. సింగరేణి మాజీ కార్మికుడైన కొప్పులకు ఈ ప్రాంతంలో బంధువర్గం, స్నేహితులు, అనుచరులు ఎక్కువగా ఉన్నారు. గతంలో ఆయన ప్రాతినిధ్యం వహించిన మేడారం నియెజకవర్గంలో భాగమైన రామగుండం, ధర్మపురి నియెజకవర్గాల్లో కొప్పులకు అభిమానులు ఉన్నారు. దీనికి తోడు కోల్‌బెల్ట్ వ్యాప్తంగా కారు పార్టీ ఓటు బ్యాంక్ బలంగా ఉండటంతో గెలుపుపై ఆశలు పెట్టుకుంటోంది బీఆర్ఎస్.

## జైలులో స్వతంత్ర మీడియా బందీ



దేశంలో న్యాయం ఎండమావిగా మారింది. స్వతంత్ర మీడియా తీవ్రమైన వేధింపులు, ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. ఆర్థిక పరమైన అవరోధాలు, దొడ్డిదారిలో స్వాధీనాలు, పత్రికాధిపతులను ఏకంగా జైలులో పెట్టడాలు వంటి చర్యలు స్వతంత్ర మీడియా ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రఖ్యాత స్వతంత్ర న్యూస్ పోర్టల్ 'న్యూస్‌క్లిక్' సంపాదకులు ప్రబీర్ పుర్కాయస్థను జైలుకు పంపిన ఉదంతం భారత దేశంలో పత్రికా స్వేచ్ఛ ఎంతటి ప్రమాదంలో ఉందో తెలియజేస్తోంది. గతేడాది అక్టోబరు నుండి తీవ్రవాద అభియోగాలపై ఆయనను జైల్లో ఉంచారు. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ మౌనం చాలా ప్రమాదకరం. న్యాయ వ్యవస్థ సమగ్రతను ఇది ప్రశ్నార్థకం చేస్తుంది. మార్చి 26న దాదాపు 600 మంది సీనియర్ న్యాయవాదులు భారత ప్రధాన న్యాయమూర్తికి ఓ బహిరంగంగా లేఖ రాశారు. ఫిబ్రవరిలో 'క్యాంపెయిన్ ఫర్ జ్యుడీషియల్ అకౌంటబిలిటీ అండ్ రిఫార్మ్స్' సంస్థ నిర్వహించిన మూడు రోజుల సదస్సులో వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరిస్తూ వారు ఈ లేఖ రాశారు. 'న్యాయపాలన, నిర్వహణ, పౌర స్వేచ్ఛ, రాజకీయ హక్కులతో కూడిన కేసుల్లో సుప్రీం కోర్టు ధోరణి' అనే అంశంపై ఈ సదస్సు జరిగింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తుల నుండి సీనియర్, యువ న్యాయవాదులు పలువురు ఈ సెమినార్‌లో ప్రసంగించారు. ఇటీవల కాలంలో వ్యక్తులను ఏకపక్షంగా అరెస్టు చేయడం, నిర్బంధించడం ఎక్కువైపోయిందని, దేశవ్యాపితంగా ఈ ధోరణి కొనసాగుతోందని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పైగా బెయిల్ ఇచ్చేందుకు దీర్ఘకాలంగా అమల్లో వున్న నియమ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తున్నారన్నారు. న్యూస్‌క్లిక్‌పై దాఖలైన కేసే దీనికి తిరుగులేని ఉదాహరణ అని వారు పేర్కొనారు. పేదలకు, అణచివేతకు గురైన లేదా దోపిడీకి గురయ్యే వర్గాలకు న్యాయం జురిగే పరిస్థితులు లేవు. ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను న్యాయమూర్తులు ప్రోత్సహించిన రోజుల్లో వారి గొంతులు వినిపించినప్పటికీ ఒక కట్టుబానిసకు గరిష్టంగా లభించేది స్వేచ్ఛ మాత్రమే, అంతేకానీ ప్రత్యామ్నాయ ఉపాధి కాదు, వేతనాలు కాదు, అటువంటప్పుడు అది కచ్చితంగా న్యాయం జరిగినట్లు కాదు. మహిళా పోలీసులు నిర్వహించే పోలీసు స్టేషన్లు వున్నా, అక్కడా న్యాయం జరగడం లేదు. మతపరమైన, భాషాపరమైన లేదా జాతి పరమైన మైనారిటీలు భారతదేశంలో రానురాను ఏకాకులుగా మిగిలిపోతున్నారు.


## ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ.....!



కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. రాజస్థాన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత గౌరవ్ వల్లభ్ పార్టీకి రాజీనామా చేశారు. తాను సనాతనానికి వ్యతిరేక నినాదాలు చేయలేనని, ఇకపై పార్టీలో కొనసాగలేనని ప్రకటించారు. గౌరవ్ వల్లభ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు తాను పంపిన రాజీనామా లేఖను సోషల్ మీడియాలో షేర్ చేశారు. దానిలో 'నేడు కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న మార్గంలో నేను ప్రశాంతంగా ఉండలేకపోతున్నాను. నేను సనాతన వ్యతిరేక నినాదాలు చేయలేను. అందుకే కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నాను. నేను కాంగ్రెస్‌లో చేరినప్పుడు దేశంలోనే ఘన చరిత్ర కలిగిన పార్టీ అని నమ్మాను. యువకులకు, మేధావుల ఆలోచనలకు విలువ ఇస్తారని భావించాను. అయోధ్యలోని నూతన రామాలయం విషయంలో కాంగ్రెస్ వైఖరికి నేను కలత చెందాను. నేను పుట్టుకతో హిందువును. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిని. ఇండియా కూటమితో సంబంధం కలిగిన పలువురు నేతలు సనాతనానికి వ్యతిరేకంగా మాట్లాడటం నాకు నచ్చలేదని' ఆ లేఖలో గౌరవ్ వల్లభ్ పేర్కొన్నారు.


గౌరవ్ వల్లభ్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో జార?ండ్‌లోని జంషెడ్‌పూర్ తూర్పు నుంచి తొలిసారి పోటీ చేశారు. గౌరవ్ విద్యావంతునిగా పేరొందారు. జేవియర్ లేబర్ రిలేషన్స్ ఇన్స్టిట్యూట్‌లో అధ్యాపకునిగా పనిచేశారు. క్రెడిట్ రిస్క్ అసెస్‌మెంట్‌లో డాక్టరేట్ అందుకున్నారు. విద్యావేత్తల కుటుంబం నుండి వచ్చిన గౌరవ్ వల్లభ్ 2023లో రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉదయపూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, ఓటమి చవిచూశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా గౌరవ్ వల్లభ్ కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించారు.

## విపత్తు నిధుల విడుదలకు ఆదేశించండి



**న్యూఢిల్లీ :** విపత్తు సహాయ నిధుల కోసం, జాతీయ విపత్తుల కోసం ఉద్దేశించిన ఆర్థిక సాయాన్ని విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతంలో కర్నాటక కూడా న్యాయస్థానంలో ఇదే రకమైన పిటిషన్ దాఖలు చేసింది. జాతీయ విపత్తు సహాయ నిధులను కేంద్రం నిలిపివేసిందని తమిళనాడు తన పిటిషన్‌లో ఆరోపించింది. తమిళనాడు పిటిషన్‌కు ప్రాధాన్యత ఉన్నందున త్వరలోనే విచారణకు వస్తుందని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ, సిబ్బంది వర్గాలు తెలిపాయి. కరువుతో విలవిలలాడుతున్న కర్నాటకకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడం లేదని ఆరోపిస్తూ న్యాయం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో సుప్రీంకోర్టు తలుపు తట్టిన విషయం తెలిసిందే. కాగా తమకు తక్షణ తాత్కాలిక సాయంగా రూ. 2,000 కోట్లు అందించేలా చూడాలని తమిళనాడు ప్రభుత్వం కోరింది. ఇటీవల సంభవించిన వరదలు, తుఫాను కారణంగా జరిగిన నష్టానికి రూ. 35,000 కోట్లు విడుదల చేసేలా కేంద్రాన్ని వెంటనే ఆదేశించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. నివేదికలపై చర్యలు తీసుకోవడంలోనూ, ఆర్థిక సాయం విడుదలకు నిర్ణయం తీసుకోవడంలోనూ కేంద్రం విఫలమైందని తమిళనాడు ఆరోపించింది.

## కేజ్రీవాల్ అంశంలో మాకు పక్షపాతం లేదు



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు అనుకూల వైఖరి తీసుకొందన్న విమర్శలకు అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ వివరణ ఇచ్చారు. తాము ఎవరికీ అనుకూలం కాదని.. ప్రతి ఒక్కరిని చట్టప్రకారం సమానంగా చూడాలని, మానవ హక్కుల విషయంలోనే మాట్లాడతామని పేర్కొన్నారు. మాథ్యూ మిల్లర్ దిల్లీ సీఎం కేజ్రీవాల్ విషయంలో మాట్లాడతారు గానీ, పాక్‌లో ప్రతిపక్ష నేతల అరెస్టులపై మాత్రం మౌనంగా ఉంటారనే విమర్శలొచ్చాయి. ఈ విషయాన్ని ఓ జర్నలిస్టు బుధవారం నేరుగా ఆయన వద్దే ప్రస్తావించారు. దీనికి స్పందిస్తూ "నేను దానిని అంగీకరించను. పాకిస్థాన్‌లో ప్రతి ఒక్కరిని చట్ట ప్రకారమే చూడాలని, వారి మానవహక్కులను గౌరవించాలని పలు మార్లు చెప్పాము.

## మేం చేసింది ఘోర తప్పిదమే.....



**గాజా :** తమ దళాల దాడిలో 'వరల్డ్ సెంట్రల్ కిచెన్' (డబ్ల్యూసీకే) స్వచ్ఛంద సంస్థకు చెందిన ఆరుగురు విదేశీ సిబ్బంది, భారత సంతతికి చెందిన పాలస్తీనా డ్రైవర్ గాజాలో ప్రాణాలు కోల్పోవడంపై ఇజ్రాయెల్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. తమవైపు నుంచి ఘోర తప్పిదం జరిగిందని పేర్కొంది. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన దాడి కాదంటూ వివరణ ఇచ్చింది. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహిస్తామని తెలిపింది. గాజాకు ఆహారం సరఫరా చేస్తున్న డబ్ల్యూసీకే బృందంపై మంగళవారం ఇజ్రాయల్ దళాలు చేసిన దాడిలో ముగ్గురు బ్రిటన్ వాసులు, ఆస్ట్రేలియా, పోలండ్, అమెరికా, కెనడాకు చెందిన నలుగురు మృతి చెందారు.

# వాకింగ్ అవసరం లేకుండా ఈ 4 పనులు చేస్తే బరువు తగ్గుతారు..



ఆరోగ్యానికి వ్యాయమం తప్పనిసరి. నేటి కాలంలో ప్రతి ఒక్కరూ బిజీగా ఉండడంతో ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తున్నారు. దీంతో అనేక కొత్త రోగాలు వస్తున్నాయి. వివిధ రకాల ఆహార పదార్థాలు తినడం వల్ల బరువు పెరుగుతున్నారు. బరువు తగ్గించుకునేందుకు రోజూవారీ జీవితంలో శారీరక శ్రమ తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. సాఫ్ట్ జాబ్స్ చేసేవాళ్లు బరువు తగ్గాలంటే రోజులో కనీసం కొన్ని నిమిషాలైనా వాకింగ్ చేస్తే ఆరోగ్యంగా ఉండగలుగుతారని అంటున్నారు. అయితే చాలా మందికి సమయం లేకపోండంతో వాకింగ్ చేయడం కుదరడం లేదు. వాకింగ్ చేయాలని ఉన్నా ఒక్కోసారి శరీరం సహకరించదు. ఈ నేపథ్యంలో వాకింగ్ కు ప్రత్యామ్నాయంగా ఇలా చేస్తే బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

స్కిప్పింగ్: చిన్నప్పుడు స్కూళ్లలో చదువుకునేటప్పుడు స్కిప్పింగ్ ను గేమ్ లో భాగంగా చేర్చేవారు. కానీ ఇప్పుడు ఇది ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు స్కిప్పింగ్ చేయడం వల్ల శరీరంలోని బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఇది సింగిల్ గా కాకుండా సన్నిహితులతో కలిసి గేమ్ లగా ఏర్పాటు చేసుకొని స్కిప్పించ్ చేయడం వల్ల మరింత ఉత్సాహంగా ఉంటారంటున్నారు. స్కిప్పింగ్ చేయడం వల్ల కండరాల గట్టిపడుతాయి. చెమటకు బయటకు తీస్తుంది. దీంతో ఆరోగ్యంగా ఉండగలుగుతారు.


ట్రెక్కింగ్: కొందరు ఖాళీ సమయం దొరికితే సినిమాలు, షికార్లకు వెళ్తుంటారు. ఈ సమయాన్ని ట్రెక్కింగ్ కు ఉపయోగిస్తే మనసు ఉల్లాసంగా ఉండడంతో పాటు ఆరోగ్యంగా ఉండగలుగుతారని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ట్రెక్కింగ్ చేయడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ట్రెక్కింగే చేసే ప్రదేశాలు తక్కువే ఉంటాయి. అయితే తీరిక దొరకినప్పుడల్లా ట్రెక్కింగ్ ను ఎంచుకోవడం ఉత్తమం అనిఅంటున్నారు.

## పేదల సంజీవనితో ప్రయోజనాలు మెండు..!



ప్రస్తుత ఆహార అలవాట్లు, మారుతున్న జీవన శైలి వల్ల ఎన్నో సమస్యలు వస్తున్నాయి. సమయం లేకపోవడం, సరైన ఫుడ్ తీసుకోకపోవడం, టెన్షన్ వంటి వాటి వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. అందుకే కొన్ని ఆహార నియమాలను డైట్ లో చేర్చుకోవాలి అంటారు నిపుణులు. కొన్ని ఖర్చుతో కూడుకున్నవి అయితే మరికొన్ని చవకగా దొరుకుతాయి. మీకు బార్లీ తెలుసా? పేదల పాలిట పెన్నిది. బార్లీలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇందులో ఉండే పోషకాలు ఎన్నో సమస్యలకు దివ్యౌషధాలుగా ఉపయోగపడుతాయి. అందుకే బార్లీ నీటిని ప్రతి రోజు ఉదయం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీరానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పేదల సంజీవని అయినా బార్లీ డయాబెటిస్ కు చాలా మంచిది. బార్లీ నీరు రక్తంలో చక్కెర స్థాయిని తగ్గించడానికి, నియంత్రించడానికి ఉపయోగపడుతాయి. హృదయనాళ ఆరోగ్యాన్నిమెరుగుపరచడమే కాదు.. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. ఈ బార్లీ నీటిలో ఫైబర్ శాతం ఎక్కువ ఉంటుంది. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. దీనివల్ల మలబద్ధక సమస్య దూరం అవుతుంది. శరీరంలో ఉన్న అదనపు కొవ్వును కూడా తగ్గిస్తుంది బార్లీ నీటిలో తక్కువ క్యాలరీలు ఉంటాయి కాబట్టి కావలసిన శక్తి కూడా అందుతుంది. బరువు పెరగరు. బార్లీ గింజలను ఉడకబెట్టి వడకట్టిన తర్వాత కాస్త రుచి కోసం నిమ్మరసం కూడా జోడించవచ్చు. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ కి అద్భుతమైనది బార్లీ నీరు. వీటిని తాగడం వల్ల మూత్రాశయ సమస్యలు దూరం చేస్తాయి. అంతేకాదు ఆరోగ్యాన్ని అందిస్తాయి. చర్మానికి చాలా మంచిది. రక్తపోటును నియంత్రించడంలో కూడా తోడ్పడతాయి. మరి తెలునుకున్నారు కదా బార్లీ నీటితో ఎంత ఉపయోగమో..ఇన్ని ప్రయోజనాలు ఉన్న బార్లీ నీటిని తాగేసేయండి. మంచి ఆరోగ్యం మీ సొంతం చేసుకోండి.

## వేసవి నుంచి కాపాడుకోవాలంటే ఇవి తినాల్సిందే..




వేసవి కాలంలో శరీరం ఎక్కువగా డీహైడ్రేట్ అవుతూ ఉంటుంది. ఈ ఎండలకు తట్టుకోవడం కష్టమే. దీంతో శరీరానికి చాలా నీరు అందించాలి. ఈ వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఇప్పుడు చెప్పుకోబోయే కొన్ని పండ్లను తీసుకుంటే మీరు ఈ ఎండాకాలంలో సేఫ్. కొబ్బరి నీళ్లలో ప్రోటీన్లు, విటమిన్లు, ఫైబర్, కాల్షియం, పొటాషియం, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. దీంతో ఈ కొబ్బరినీళ్లు తీసుకుంటే శరీరం ఎప్పుడూ కూడా డీహైడ్రేట్ అవకుండా కాపాడుకోవచ్చు. పుచ్చకాయలో 92 శాతం నీరే ఉంటుంది. అందుకే వీటిని ఎండాకాలంలో ఎక్కువ తీసుకోవాలి. కీరదోసలో కూడా 95 శాతం నీరే ఉంటుంది. అందుకే ఈ కీరదోసను తినడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గదు. తియ్యగా ఉండే కర్బూజ పండ్లు అందరికీ ఇష్టమే. దీనివల్ల లవణాలు అందుతాయి. ఇక వేసవి తాపం నుంచి బయటపడవచ్చు. బొప్పాయి పండ్లలో కూడా నీటి శాతం అధికంగా ఉంటుంది.

## పీరియడ్స్ సమయంలో ఈ తప్పులు చేయకూడదు..



కొన్ని విషయాల పట్ల పెద్దలు చాలా జాగ్రత్తలు చెబుతుంటారు. కానీ మీకేం తెలుసే ముసలొల్లు అని కొట్టిపారేస్తారు ఈ కాలం జనరేషన్ అమ్మాయిలు. అయితే పీరియడ్స్ సమయంలో కూడా కొన్ని విషయాలను చెబుతారు. కానీ వింటేగా.. అయితే పీరియడ్స్ సమయంలో కడుపు నొప్పి, నడుము నొప్పి వంటివి ఇబ్బంది పెడతాయి. మానసికంగా కూడా ఈ సమయంలో కాస్త ఇబ్బందిగానే అనిపిస్తుంటుంది. కానీ తెలిసి తెలియక కొన్ని తప్పులు చేస్తుంటారు. మరీ ఈ పీరియడ్స్ సమయంలో చేయకూడని తప్పులు ఏంటో చూసేద్దామా? వాక్సింగ్.. పీరియడ్స్ సమయంలో వాక్సింగ్ చేయకూడదు. దీనివల్ల సున్నితత్వం, నొప్పి మరింత పెరుగుతుంది. రుతుస్రావం సమయంలో హార్మోన్ల హెచ్చుతగ్గులు స్కిన్ ను సున్నితంగా చేస్తాయి. వాక్సింగ్ సెషన్ లలో అసౌకర్యాన్ని పెంచుతాయి. అసౌకర్యం తగ్గడానికి పీరియడ్స్ కు ముందు, తర్వాత వ్యాక్సింగ్ చేయించుకోవడం మంచిది. నీరు తక్కువ తీసుకోవడం.. పీరియడ్స్ లో కలిగే ఇబ్బంది వల్ల చాలా మంది మహిళలు నీరు తాగడం మర్చిపోతుంటారు. యూరిన్ కు ఎక్కువ సార్లు వెళ్లాల్సి వస్తుందని మరింత భయపడతారు. కానీ ఈ సమయంలోనే మంచినీరు ఎక్కువ తీసుకోవాలి. హైడ్రేటెడ్ గా ఉంచడం చాలా ముఖ్యం. ఈ సమయంలో నీరు ఎక్కువగా తాగడం వల్ల కడుపు ఉబ్బరం, తిమ్మిరి, తలనొప్పి వంటి సమస్యలు రావు. పెయిన్ తగ్గించే మందులు.. పీరియడ్స్ లో నొప్పి ఎక్కువగా ఉంటుంది. కానీ దాన్ని తగ్గించుకోవడానికి టాబ్లెట్స్ మాత్రం వాడకూడదు అంటారు నిపుణులు. ఇవి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలను కలిగిస్తాయి. ఇబుప్రోఫెన్ వంటి నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ మితిమీరిన వినియోగం వల్ల జీర్ణ సమస్యలు, ఇతర సమస్యలు వస్తాయట. మందుల మీద ఆధారపడకుండా రుతుక్రమ అసౌకర్యాన్ని తగ్గించే హీట్ థెరపీ సున్నితమైన వ్యాయామం వంటివి చేయాలి.

## రాత్రి అన్నం తినడం మానేస్తున్నారా....?



ప్రస్తుత రోజుల్లో అధిక బరువు పెద్ద సమస్యగా మారుతుంది. బరువు ఎలా తగ్గాలి అని చేయని పనులు ఉండవు కొందరు. ఇందులో భాగంగానే కొందరు రాత్రి పూట భోజనం చేయడం మానేస్తారు. రాత్రి పూట అధికంగా ఆహారం తీసుకుంటే బరువు పెరుగుతారు అని చెబుతుంటారు నిపుణులు. దీంతో కొందరు మొత్తానికే ఆహారాన్ని తీసుకోకుండా ఉంటున్నారు. కానీ దీని వల్ల చాలా సమస్యలు వస్తాయట. ఇంతకీ రాత్రి భోజనం చేయకపోవడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఓ సారి తెలుసుకోండి. సాధారణంగా ఉదయం మధ్యాహ్నం కంటే రాత్రిళ్లు తక్కువ ఆహారం తీసుకోవాలి అని చెబుతుంటారు నిపుణులు. రాత్రి శరీరానికి శ్రమ ఉండదని ఈ సలహా ఇస్తారు. బిజీ లైఫ్ లో రాత్రి పది తర్వాత భోజనం చేసే వారి సంఖ్య మరింత పెరుగుతుంది. దీంతో తినగానే వెంటనే నిద్ర పోయే వారి సంఖ్య కూడా పెరుగుతుంది. దీనివల్ల ఊబకాయం, డయాబెటిస్ వంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కానీ రాత్రి తినకుండా ఉండటం కూడా మంచిది కాదు. దీనివల్ల ఎన్నో సమస్యలు వస్తాయట. రాత్రి పూట పూర్తిగా ఆహారం తీసుకోకుండా ఉండడం ప్రమాదకరం. దీనివల్ల ఇన్సులిన్ స్థాయిలు క్షీణిస్తాయి. తద్వారా శరీరంపై తీవ్ర ప్రభావం ఏర్పడుతుంది. రాత్రిపూట ఆహారం తీసుకోకపోతే గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు పెరుగుతాయట. దీనివల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. అలాగే అల్సర్, ఎసిడిటీ వంటి సమస్యలు కూడా మొదలవుతాయి అంటున్నారు నిపుణులు. రాత్రిళ్లు తక్కువ ఆహారం తీసుకోవడం వల్ల ఎలాంటి సమస్య ఉండదు. పైగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది కానీ పూర్తిగా ఆహారం తీసుకోవడం మానేస్తే చాలా సమస్యలు మాత్రం ఎదుర్కోవాల్సి వస్తుంది. గుండెలో మంట, పుల్లని త్రేన్పులు వంటి సమస్యలు వచ్చే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది అని చెబుతున్నారు నిపుణులు. మరి తెలుసుకున్నారు కదా ఆహారం సరిగా తీసుకోకపోతే ఎలాంటి సమస్యలు వస్తాయో.. ఇప్పుడు అయినా మీ డైట్ ను మార్చుకోండి.


## వట్టివేర్ల గురించి ఈ నిజాలు తెలుసా?

వట్టివేర్లు.. గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. వీటినే ఖుస్ అని అంటారు. ఇవి ఒక రకమైన సువాసన వచ్చే పొడవైన గడ్డి మొక్క వేర్లు. సంప్రదాయ పద్ధతుల్లో ఈ గడ్డి మొక్క వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. మొక్క కంటే వేర్ల వల్ల ఇంకా ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయి. అయితే మనలో చాలా తక్కువ మందికి మాత్రమే ఈ వేర్లు గొప్పవనీ, మంచివనీ తెలుసు. కానీ వీటిని ఎలా వాడాలో సరిగా తెలియదు. అదెలాగో తెలిస్తే కచ్చితంగా వీటిని కొంటారు. ఇదేమీ పెద్ద సీక్రెట్ కాదు. ఒక మట్టి కుండలో తాగు నీరు పోసి అందులో వట్టి వేర్లను వెయ్యాలి. వేర్లు నీటిలో పూర్తిగా మునగాలి. ఇలా కొన్ని గంటలు ఉంచాలి. ఆ తర్వాత నీటిని వడగట్టి ఆ నీటిని తాగితే చాలు. వట్టి వేర్ల నీటిని చల్లబరుస్తాయి. అంతేకాదు శరీరంలో వేడిని తగ్గిస్తాయి. చలవ చేస్తాయి. ఇవి సహజసిద్ధంగా విష వ్యర్థాలు, విష సూక్ష్మక్రిములతో పోరాడతాయి. శరీరంలో వేడిని తగ్గించడమే కాదు బాడీకి ఉపశమనం కలిగిస్తాయి. మానసికంగా కూడా హాయిగా ఉంటుంది. బ్రెయిన్ కణాలు చల్లగా అవుతాయి. కోపం, ఆవేశం తగ్గేందుకు ఈ వేర్లు కొంత వరకూ సహాయపడతాయి. వట్టి వేర్ల నుంచీ వచ్చే తైలం కూడా చాలా మంచిది. ఇది విడిగా



మార్కెట్లలో దొరుకుతుంది. లేదా, ఈ కామర్స్ సైట్లలో లభిస్తాయి. 50 గ్రాముల వేర్లు రూ. 80 దాకా ఉంటాయి. ఇందులో యాంటీసెప్టిక్ గుణాలు ఉంటాయి. ఈ ఆయిల్‌ని చర్మం, జుట్టుకి వాడినప్పుడు ఇది మొత్తం క్లీన్ చేస్తుంది. నురగలా వచ్చి శుభ్రపడుతుంది. మనం వాడేసిన వట్టి వేర్లను పారేయడం కామన్. అయితే కొన్ని కంపెనీలు ఈ వేర్లను మ్యాట్స్ లేదా పరుపుల తయారీకి వాడుతున్నాయి. ఈ పరుపులపై పడుకుంటే చల్లగా మనస్శాంతిగా ఉంటుంది. ఆక్సిజన్ లెవెల్స్ కూడా పెరుగుతాయి.

## తాటి ముంజలకూ కష్టకాలం......!



ప్రకృతి మనకు ఎంతో చేస్తోంది. ఎన్నో ఆరోగ్యవంతమైన చెట్లు, పండ్లు, ఆకులను ఇస్తుంది. అయితే వాటిని గుర్తించడంలోనే మనిషి విఫలమవుతున్నాడు. అందుబాటులో ఉన్నవానిని సద్వినియోగం చేసుకోలేక.. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన వేల రూపాయలు ఆస్పత్రికి ఖర్చు పెడుతున్నారు. ఉచితంగా, సహజంగా అందే వాటిని దూరం పెడుతన్నారు. అయితే వైద్యులు కూడా సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలని సూచిస్తుంటారు. కానీ, వాటిని పెద్దగా పట్టించుకోకుండా జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ రెడీమేడ్ ఫుడ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. తాటి ముంజలు దొరకవా.. ఇక ప్రస్తుతం తాటి ముంజల సీజన్. పది ఇరవై ఏళ్ల క్రితం వరకు తాటి ముంజలు మార్కెట్‌లో విరివిగా లభించేవి. ఇక ఊళ్లకు వెళితే.. గౌడన్నలు ఫ్రీగా కోసి ఇచ్చేవారు. చెట్టు మీది తాటి ముంజలు తింటే వచ్చే టేస్టే వేరు. కానీ, ప్రస్తుత పరిస్థితి చూస్తే తాటి ముంజలు కూడా రానురాను దొరకవేమో అనిపిస్తోంది. కోసేవారు లేక.. గ్రామాల్లో గీత కార్మికులు తగ్గిపోతున్నారు. గౌడ కుటుంబాలు ఉన్నా తాటి చెట్లు ఎక్కేవారు తగ్గిపోతున్నారు. ఒకప్పుడు ఊళ్లో ప్రతీ గౌడ కుటుంబంలో ఒకరిద్దరు గీత కార్మికులు ఉండేవారు. ఇప్పుడు ఊరికి కూడా ఇద్దరు ముగ్గురు మించి ఉండడం లేదు. దీంతో కల్లు గీసేవారు, తాటి ముంజలు కోసేవారు తగ్గిపోతున్నారు. సీజనల్‌గా తాటి ముంజలు అమ్మేవారు ఇబ్బంది పడుతన్నారు. పెరుగుతున్న ధర.. తాటి ముంజలు కోసేవారు తగ్గిపోవడంతో తాటి ముంజల ధర కూడా పెరుగుతోంది.

ఊళ్లో ఉండే ఇద్దరు ముగ్గురు గీత కార్మికులు తాటి చెట్టు ఎక్కి ముంజలు కోసి ఇవ్వడానికి డబ్బులు తీసుకుంటున్నారు. ఒకప్పటిలా ఫ్రీగా కోసి ఇవ్వడం లేదు. దీంతో వాటిని మార్కెట్‌కు, ఊళ్లకు తీసుకువచ్చి అమ్మేవారు ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. ఒకప్పుడు రూపాయి, రెండు రూపాయలు ఉన్న ముంజలు ఇప్పుడు పది రూపాయలకుపైగా పలుకుతోంది. ముంజలు తీయడం ఇబ్బందే.. ఇక గీత కార్మికులు తాటికాయలు మాత్రమే కోసి ఇస్తున్నారు. ముంజలు తీయడం లేదు. దీంతో వాటిని అమ్మేవారే అమ్మే స్థలంలోనే కోసి ఇస్తున్నారు. గీత కార్మికులు నేర్పరితో కోయడం వలస సులభంగా ముంజలు తీస్తారు.



## గుండె బద్దలు కొట్టిన బుట్టబొమ్మ



పూజా హెగ్డే బాయ్ ఫ్రెండ్ అంటూ గత కొన్ని రోజులుగా బీ టౌన్‌లో వార్తలు వస్తూనే ఉన్నాయి. రోహన్ మెహ్రాతో పూజా హెగ్డే కనిపించే వీడియోలతో రకరకాల రూమర్లు పుట్టుకొచ్చాయి. కానీ తామిద్దరం మంచి స్నేహితులమని పూజా హెగ్డే చెబుతుంటుందట. పూజా హెగ్డే జోరు ఇప్పుడు తెలుగులో తగ్గింది. వరుసగా ఫ్లాపులు రావడంతో పూజా హెగ్డేను తెలుగు మేకర్లు పక్కన పెట్టేసినట్టుగా కనిపిస్తోంది. ఇక తమిళంలోనూ ఈ బుట్టబొమ్మకు అంతగా ఆఫర్లు రావడం లేదనిపిస్తోంది. ఇక పూజా హెగ్డేకు అంతో ఇంతో బాలీవుడ్‌లోనే ప్రాజెక్టులు వస్తున్నాయి. సల్మాన్ ఖాన్‌తో చేసిన చిత్రం డిజాస్టర్ అయింది. విజయ్ బీస్ట్ కూడా బెడిసి కొట్టేసింది. తెలుగులో అయితే హిట్టు కొట్టి చాలా రోజులు అవుతోంది. ఇక సినిమాల సంగతి పక్కన పెడితే.. పూజా హెగ్డే తన అందాలతో నెట్టింట్లో బాగానే ట్రెండ్ అవుతోంది.ఇక ఇప్పుడు పూజా హెగ్డే బాయ్ ఫ్రెండ్ అంటూ నెట్టింట్లో చర్చలు జరుగుతున్నాయి. గత మూడు నాలుగేళ్లుగా పూజా హెగ్డే బాయ్ ఫ్రెండ్ ఎవరనేదానిపై చర్చలు జరుగుతూనే ఉన్నాయి. తారా సుతారియ ఎక్స్ బాయ్ ఫ్రెండ్ రోహన్ మెహ్రాతో ఆ మధ్య బీ టౌన్‌లో బాగానే కనిపించింది పూజా హెగ్డే. దీంతో ఈ ఇద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, డేటింగ్ చేస్తున్నారని అంతా అనుకున్నారు. కానీ ఆ ఇద్దరూ మంచి ఫ్రెండ్స్ మాత్రమే అని తరువాత వార్తలు వచ్చాయి.



## మరీ అంత ప్రేమ ఏంటి శ్రీవల్లి...!

రష్మిక మందన్న రెండు మూడు లేడీ ఓరియంటెడ్ సినిమాలను కూడా చేస్తున్న విషయం తెల్సిందే. పుష్ప మరియు యానిమల్ సినిమాలతో పాన్ ఇండియా స్టార్ డమ్ దక్కించుకున్న రష్మిక మందన్న ప్రస్తుతం వరుసగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. ఇప్పటికే పుష్ప 2 సినిమాలో నటిస్తున్న ఈ అమ్మడు తమిళంలో ధనుష్‌కి జోడీగా ఒక సినిమా లో, హిందీలో ఒకటి రెండు సినిమాల్లో నటిస్తోంది. ఇంత బిజీగా ఉన్న రష్మిక మందన్న కొన్నాళ్లుగా వర్కౌట్స్ మానేశాను... మళ్లీ మొదలు పెట్టాను అంటూ ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇప్పుడు రష్మిక మందన్న రెండు మూడు లేడీ ఓరియంటెడ్ సినిమాలను కూడా చేస్తున్న విషయం తెల్సిందే. సోషల్ మీడియా లో రెగ్యులర్ గా పోస్టులు పెట్టే రష్మిక తాజాగా ఆసక్తికర పోస్ట్ షేర్ చేసింది. తన పెట్ డాగ్ ను బెడ్ పై పడుకోబెట్టుకుని సోషల్ మీడియాలో ఆ ఫోటోను షేర్ చేసింది. నా ఉదయం ఈమెతో చాలా బెస్ట్ గా మారుతుంది అంటూ ఈ ఫోటోకు రష్మిక మందన్న లవ్ ఈమోజీని షేర్ చేసి మరీ కామెంట్ చేసింది. అందమైన ఈ ఫోటోకి నెటిజన్స్ క్యూట్ గా ఉందంటూ తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఒక పెట్ డాగ్‌పై ఇంత అభిమానం, ప్రేమ ఏంటి అమ్మడు అంటూ చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థాయిలో ఒక పెట్‌ను ప్రేమించిన సెలబ్రి టీని మేము చూడలేదు అంటూ కొందరు సోషల్ మీడియాలో మాట్లాడుకుంటూ ఉన్నారు. మొత్తానికి రష్మిక తన పెట్ లవ్ ను ఇలా చూపించి అందరిని ఆశ్చర్య పరిచింది.

రష్మిక మందన్న బాలీవుడ్ లో చేసిన గత చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచినా కూడా యానిమల్ సినిమాతో స్టార్ హీరోయిన్ ఇమేజ్ ను సొంతం చేసుకుంది. దాంతో కచ్చితంగా ముందు ముందు హిందీలో సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి అంటూ వార్తలు వస్తున్నాయి.

## ఇంటర్నేషనల్ లెవల్లో

సూపర్ స్టార్ మహేష్ బాబు 'గుంటూరు కారం' సినిమా ఈ ఏడాది సంక్రాంతికి రిలీజై ఫర్వాలేదనిపించింది. త్రివిక్రమ్ డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా థియేటర్లో కంటే ఓటీటీలో పెద్ద హిట్ అవ్వడం విశేషం. ఇక ఈ చిత్రంలో కుర్చీ మడతపెట్టి సాంగ్ మాత్రం ఓ ఊపు ఊపేసింది. ఇందులో మహేష్ బాబు-శ్రీలీల వేసిన



స్టెప్పులకి థియేటర్లు దద్దరిల్లిపోయాయి. ఇక సోషల్ మీడియాలో అయితే ఈ పాటకి కుర్రాళ్లు అందరూ తెగ స్టెప్పులేశారు. అయితే తాజాగా ఈ పాట మరో అరుదైన గుర్తింపు కూడా దక్కించుకుంది.

**గ్లోబల్ స్థాయిలో...**

తాజాగా కుర్చీ మడతపెట్టి సాంగ్‌ను అమెరికాలోని హ్యూస్టన్‌లో ప్లే చేశారు. అక్కడ టయోటా సెంటర్‌లో జరిగిన (నేషనల్ బాస్కెట్ బాల్ అసోసియేషన్) గేమ్ హాఫ్‌టైమ్‌లో ఈ పాటకి కొంతమంది డ్యాన్స్ చేశారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కుర్చీ మడతపెట్టి సాంగ్ గల్లీ నుంచి గ్లోబల్ స్థాయికి చేరిందంటూ మహేష్ ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. థమన్ కంపోజ్ చేసిన ఈ పాటలో మహేష్ బాబు- శ్రీలీల వేసిన స్టెప్పులకి ఫ్యాన్స్ ఫ్యూజులు ఎగిరిపోయాయి. ఇక యూట్యూబ్‌లో అయితే ఇప్పటివరకూ ఈ వీడియో సాంగ్‌కి 158 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఈ పాటను శేఖర్ మాస్టర్ కంపోజ్ చేశారు.

## నిండిపోయిందన్న అనుపమ




టిల్లు స్క్వేర్ సినిమాకు థియేటర్లో అదిరిపోయే రెస్పాన్స్ వస్తోంది. చూస్తుంటే వీకెండ్‌లోనే అన్ని ఏరియాల్లోనే బ్రేక్ ఈవెన్ కొట్టేలా ఉంది. నిర్మాత నాగవంశీ అన్నట్టుగా ఈ మూవీ వంద కోట్ల క్లబ్బులో జాయిన్ అయ్యేలా ఉంది. ఇప్పటికే దగ్గరదగ్గరగా యాభై కోట్ల గ్రాస్ మార్క్‌ను టిల్లు గాడు తన జేబులో వేసుకున్నాడని తెలుస్తోంది. అనుపమ ప్రస్తుతం టిల్లు స్క్వేర్ సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉందనిపిస్తోంది. అనుపమకు ఇది చాలా కొత్త పాత్ర. ఎప్పుడూ అనుపమ పక్కింటి అమ్మాయిలా, పద్దతైన పాత్రల్లో కనిపిస్తూ ఉండేది. కానీ మొదటి సారిగా తన హద్దుల్ని చెరిపేసుకుంది. రొమాంటిక్ సీన్లలో రెచ్చిపోయింది. లెక్కలేనన్ని లిప్ లాక్‌లు పెట్టేసింది. ఇక బోల్డ్ సీన్లకు కొదువే లేకుండాపోయింది. తన కెరీర్‌లోనే ఇదొక భిన్నమైన, టర్నింగ్ పాయింట్ లాంటి కారెక్టర్‌ను అనుపమ పోషించింది. ఈ మూవీ హిట్టయింది కాబట్టి.. ఇకపై అనుపమకు ఇలాంటి రోల్స్ బాగానే వస్తాయి.

పైగా తాను మొదటి సారి చేసిన ఈ ప్రయోగానికి మంచి స్పందన వస్తుండటంతో అనుపమ కూడా ఫుల్ ఖుషీ అవుతున్నట్టుగా ఉంది. ఇక టిల్లు స్క్వేర్‌కు వస్తున్న స్పందన చూసి యూనిట్ కూడా హ్యాపీగానే ఉన్నట్టుగా ఉంది. ఇక ఈ మూవీకి మంచి కలెక్షన్లు వస్తున్నాయి. చూస్తుంటే వీకెండ్‌లోనే ఈ మూవీ బ్రేక్ ఈవెన్ అవుతుందని అంటున్నారు. ఇప్పటికే చాలా ఏరియాల్లో బ్రేక్ ఈవెన్‌కు దగ్గరగా వచ్చిందని అంటున్నారు. ఇక సండే కలెక్షన్ల కూడా కలిపితే చాలా చోట్ల బ్రేక్ ఈవెన్ అవుతుందని చెబుతున్నారు.

ఇక ఈ మూవీని థియేటర్లో చూసి అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. రొమాంటిక్ సీన్లకు ఓ తాత ముసిముసి నవ్వులు నవ్వుతూ, సిగ్గు పడ్డ వీడియో ఒకటి బాగానే ట్రెండ్ అయింది. ఈ వీడియో చివరకు అనుపమ వద్దకు చేరుకుంది. ఈ వీడియో చూసి గుండె నిండిపోయిందన్నట్టుగా ఆమె తన ఇన్ స్టా స్టోరీలో పెట్టేసుకుంది. టిల్లు స్క్వేర్ సినిమా బ్లాక్ బస్టర్ దిశగా వెళ్తుండటంతో మూడో పార్టుని కూడా మేకర్లు అనౌన్స్ చేశారు. టిల్లు క్యూబ్ ఉంటుందని నిర్మాతలు ప్రకటించారు. డీజే టిల్లులో రాధికగా నేహా శెట్టి, టిల్లు స్క్వేర్‌లో లిల్లీగా అనుపమ అదిరిపోయే పర్ఫామెన్స్‌లు ఇచ్చారు. మరి ఈ మూడో పార్టులో ఎవరు హీరోయిన్‌గా ఉంటారో చూడాలి.

# బ్యాంకింగ్ సమస్యలు వేధిస్తున్నాయా...?



ఏటీఎం ఉపసంహరణలు, బౌన్స్ అయిన చెక్కులు, కనీస నిల్వలను నిర్వహించడంలో వైఫల్యం వంటి సేవలకు బ్యాంకులు విధించే అధిక రుసుములను కస్టమర్లు తరచుగా ఉదహరించే సాధారణ ఫిర్యాదులు ఉన్నాయి. కొన్ని ఫిర్యాదులు వ్యక్తిగత బ్యాంకులకు అంతర్గతంగా ఉంటాయి. బ్యాంకింగ్ ఇన్నర్ సర్కిల్స్ నుంచి పరిష్కారం అవసరం. ఇది సరిపోని కస్టమర్ సేవ వంటి సమస్యలను కలిగి ఉండవచ్చు. ఖాతాదారులు తరచూ బ్యాంకులు అందించిన సబ్‌పార్ కస్టమర్ సేవ గురించి బాధపడుతున్నారు. ఇటీవల కాలంలో బ్యాంకింగ్ కస్టమర్లు విపరీతంగా పెరిగారు. కస్టమర్లు తరచుగా అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. వారి

## వారికి ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కారం

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కోరుకుంటారు. ఏటీఎం ఉపసంహరణలు, బౌన్స్ అయిన చెక్కులు, కనీస నిల్వలను నిర్వహించడంలో వైఫల్యం వంటి సేవలకు బ్యాంకులు విధించే అధిక రుసుములను కస్టమర్లు తరచుగా ఉదహరించే సాధారణ ఫిర్యాదులు ఉన్నాయి. కొన్ని ఫిర్యాదులు వ్యక్తిగత బ్యాంకులకు అంతర్గతంగా ఉంటాయి. బ్యాంకింగ్ ఇన్నర్ సర్కిల్స్ నుంచి పరిష్కారం అవసరం. ఇది సరిపోని కస్టమర్ సేవ వంటి సమస్యలను కలిగి ఉండవచ్చు. ఖాతాదారులు తరచూ బ్యాంకులు అందించిన సబ్‌పార్ కస్టమర్ సేవ గురించి బాధపడుతున్నారు. సుదీర్ఘ నిరీక్షణతో పాటు కస్టమర్ కేర్ నుంచి సరైన స్పందన రాకపోవడం వల్ల ఎవరికి చెప్పుకోవాలో? తెలియక ఇబ్బందిపడుతూ ఉంటారు.

# అమ్మకాల్లో మారుతి జోరు...!



కార్లను మారుతి కంపెనీ మార్కెట్లోకి తీసుకొస్తుంది. ఈ తరుణంలో కంపెనీ అమ్మకాలు జోరందుకుంటాయి. కొన్నేళ్లగా మారుతికి చెందిన కార్లు విపరీతంగా అమ్మకాలు జరుపుకుంటూ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తున్నాయి. ఇదే సమయంలో కొత్త కొత్త మోడళ్లను వినియోగదారులకు పరిచయం చేస్తూ ఆకటటుకుంటోంది. తాజాగా విడుదలయిన లెక్కల ప్రకారం మారుతి కార్లు అత్యధికంగా సేల్స్ జరుపుకున్నాయి. ఆ వివరాల్లోకి వెళితే.. హ్యాచ్ బ్యాక్ నుంచి ఎస్ యూవీ వరకు వివిధ వేరియంట్లను మారుతి ఉత్పత్తి చేస్తుంది. అన్ని రకాల కార్లను అందుబాటలోకి తీసుకురావడం వల్ల మారుతిని వినియోగదారులు ఆదరిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో మారుతి సుజుకీ ఎగ్జిక్యూటీ కమిటీ సభ్యుడు శశాంక్ శ్రీ వాస్తవ్ అమ్మకాల గురించి ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. 2023 -24 ఆర్థిక సంవత్సరానికి మారుతి సుజుకి 2,135,322 యూనిట్లను అమ్మకాలు చేసింది. ఇందులో అత్యధికంగా దేశీయ విక్రయాలు 1,793, 644 యూనిట్లు ఉన్నాయి. ఎగుమతులు 283,067 ఉన్నాయి. వివిధ మోడళ్లు మారుతి నుంచి రిలీజ్ అయినా ఈ ఏడాది మాత్రం హ్యాచ్ బ్యాక్ లు, సెడాన్ ల కంటే ఎస్ యూవీ అమ్మకాలు పెరిగాయి. గతంలో మారుతి వ్యాగన్ ఆర్ అత్యధికంగా సేల్స్ నమోదు చేసుకున్నప్పటికీ 2023-24లో మాత్రం స్వల్పంగా క్షీణించింది. SUV విభాగాలను ఆదరిస్తున్న క్రమంలో గ్రాండ్ విటారా, బ్రెజ్జా, ఫ్రాంటెక్స్ ను ఆదరించే అవకాశం ఉందని తెలుస్తోంది. పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ ఎస్ యూవీ కార్లను కోరుకుంటున్నారు. ముఖ్యంగా సీఎన్ జీ వెర్షన్ ను ఎక్కువగా ఆదరిస్తున్నారు. ఎస్ యూవీలతో పాటు ఎంపీవీలు కూడా వృద్ధిని సాధించాయి.

# దేశీయంగా తొలి వాణిజ్య క్రూడాయిల్ స్టోరేజీ!



క్రూడాయిల్ సరఫరాలో ఒడిదుడుకులు ఏవైనా తలెత్తితే సమర్ధంగా ఎదుర్కొనేందుకు దేశీయంగా తొలి వాణిజ్యపరమైన వ్యూహాత్మక ముడిచమురు స్టోరేజీ యూనిట్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. కర్ణాటకలోని పాడూర్‌లో 2.5 మిలియన్ టన్నుల నిల్వ సామర్థ్యంతో భూగర్భంలో ముడిచమురు నిల్వ కోసం స్టోరేజీని నిర్మించేందుకు (పాడూర్ 2) ఇండియన్ స్ట్రాటెజిక్ పెట్రోలియం రిజర్వ్ (ఐఎస్పీఆర్ఎల్) బిడ్లను ఆహ్వానించింది. బిడ్ల దాఖలుకు ఏప్రిల్ 22 ఆఖరు తేదీ కాగా, జూన్ 27 నాటికి ప్రాజెక్టును కేటాయిస్తారు. దీనికి సంబంధించిన టెండర్ డాక్యుమెంట్ల ప్రకారం ఇది ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) ప్రాతిపదికన ఉంటుంది. ప్రైవేట్ పార్టీలు స్టోరేజీని డిజైన్ చేయడం, నిర్మించడం, ఫైనాన్స్ చేయడం, నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. పాడూర్-2 స్టోరేజీని ఆపరేటరు ఏ ఆయిల్ కంపెనీకైనా లీజుకివ్వచ్చు. అందులో చమురుని నిల్వ చేసుకునే కంపెనీలు దాన్ని దేశీ రిఫైనర్లకు విక్రయించుకోవచ్చు. అయితే, అత్యవసర పరిస్థితుల్లో మాత్రం నిల్వలను ముందుగా ఉపయోగించుకునేందుకు భారత ప్రభుత్వానికి హక్కులు ఉంటాయి. ఐఎస్పీఆర్ఎల్ తొలి దశలో విశాఖపట్నంతో పాటు మంగళూరు, పాడూర్‌లో 5.33 మిలియన్ టన్నుల నిల్వ సామర్థ్యంతో వ్యూహాత్మక స్టోరేజీ యూనిట్లను ప్రభుత్వ వ్యయంతో ఏర్పాటు చేసింది.

# ఇన్ఫోసిస్ కీలక నిర్ణయం.. ఐటీ ఉద్యోగులకు సంకటమేనా?

గత కొద్ది సంవత్సరాలుగా ఐటి పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. కోవిడ్ సమయంలో అద్భుతమైన ప్యాకేజీలతో, ఇంటి వద్ద నుంచే పని చేసే అవకాశం తో ఐటీ ఉద్యోగులు పండగ చేసుకున్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు కోల్పోయి చాలామంది ఇబ్బంది పడుతుంటే.. వారు ఐదు నుంచి 6 అంకెల జీతాన్ని వెనకేసుకున్నారు. ఎప్పుడైతే కోవిడ్ తర్వాత పరిస్థితులు మారిపోయాయో.. అప్పటినుంచి ఐటీ ఉద్యోగులకు రోజూ గండమే ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో లే ఆఫ్ తెరపైకి వచ్చింది. దీంతో కంపెనీలో ఉద్యోగులను అడ్డగోలుగా తొలగిస్తున్నాయి. ఇప్పటికే మంది ఉద్యోగులను ఇంటికి పంపించాయి. ఇక మనదేశంలో కూడా అలాంటి పరిస్థితే ఉంది. ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ లే ఆఫ్ నేపథ్యంలో సరికొత్త నిర్ణయం తీసుకుంది. దీంతో ఐటీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ప్రాజెక్ట్ లలో పాల్గొంటున్న ఉద్యోగుల కోసం ఇన్ పర్సన్ కొల్లాబ్ వీక్స్ విధానాన్ని అమలు చేస్తోంది. విధానం ప్రకారం ప్రాజెక్టులలో పనిచేసే ఉద్యోగులు సంస్థ నిర్ణయించిన వారాల్లో సంబంధిత క్యాంపస్ లకు హాజరు కావలసి ఉంటుంది. స్థూలంగా మన పారిభాషలో చెప్పాలంటే ఉద్యోగులను తిరిగి కార్యాలయాలకు రప్పించేందుకు సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. తాజా వార్తల ప్రకారం ఇన్ఫోసిస్ ఉద్యోగులు నెలలో పది రోజులు కార్యాలయం నుంచి కచ్చితంగా పనిచేయాల్సిన నిబంధన అమలు కానుంది.. ఇప్పటికే మెయిల్స్ ద్వారా సంస్థ ఈ విషయాన్ని ఉద్యోగులకు తెలిపింది.. ఫలితంగా ఇది వెలుగులోకి వచ్చింది. ఈ విధానం కంటే ముందు ఇన్ఫోసిస్ హైబ్రిడ్ వర్క్ పాలసీని తెరపైకి తీసుకువచ్చింది. దీని ప్రకారం ప్రతి ఒక్క ఉద్యోగి నెలలో పది రోజుల్లో చొప్పున క్వార్టర్లో 30 రోజులపాటు ఆఫీసుకు రావాల్సి ఉంటుంది. ఇలా ఉద్యోగులను కార్యాలయానికి రప్పించడం ద్వారా టీం వర్క్ పెరుగుతుందని, ఉత్పాదకత పెంపొందుతుందని ఇన్ఫోసిస్ బాధ్యులు చెబుతున్నారు. ఇక కొల్లాబ్ వీక్స్ లో పాల్గొనే ఉద్యోగుల సంఖ్యపై ఇన్ఫోసిస్ స్పష్టమైన ప్రకటన చేయలేదు.. పది రోజుల వర్క్ ఫ్రం ఆఫీస్ నిబంధన పై ఇప్పటికే మిశ్రమ స్పందన వస్తోంది. కొంతమంది




ఉద్యోగులు దీనిని సమర్థిస్తుంటే.. మరి కొంతమంది వ్యతిరేకిస్తున్నారు. క్యాంపస్ హాజరు పెంచడం వల్ల ఆఫీస్ టర్నింగ్ పెరుగుతుందని.. క్రమబద్ధమైన మెరుగుదల సాధ్యమవుతుందని ఇన్ఫోసిస్ బాధ్యులు భావిస్తున్నారు. వ్యాపార వృద్ధి తోపాటు, ఉద్యోగుల మధ్య స్నేహ పూరితమైన వాతావరణం, ఆవిష్కరణల పెంపుదలకు ఈ విధానం సహకరిస్తుందని ఇన్ఫోసిస్ మానవ వనరుల విభాగం అధిపతులు అభిప్రాయపడుతున్నారు.


# బెస్పోక్ గృహోపకరణాల లైనప్‌ను పరిచయం చేసిన శాంసంగ్...!



శాంసంగ్, భారతదేశంలోని ప్రముఖ వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, ఏఐ సాంకేతికతతో నడిచే దాని బెస్పోక్ ఉపకరణాలను ఆవిష్కరించింది. కనెక్ట్ చేయబడిన, పర్యావరణ అనుకూల గృహాల రంగంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. ఈసందర్భంగా శాంసంగ్ సౌత్ వెస్ట్ ఏషియా ప్రెసిడెంట్ అండ్ సీఈఓ జేబీ పార్క్ మాట్లాడుతూ.. తాము బెస్పోక్ ఏఐని ఆవిష్కరిస్తున్నామన్నారు. గృహోపకరణాల్లో తమ సరికొత్త ఆవిష్కరణ, మరింత సుస్థిరమైన పర్యావరణం కోసం ఇంధన సామర్థ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు భారతీయ గృహాల్లో తెలివిగా జీవించడాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఉందన్నారు. తమ బెస్పోక్ ఏఐ-ఆధారిత గృహోపకరణాలతో, వినియోగదారులు వారి ఎంపికలను అనుకూలీకరించగలరన్నారు. పెద్దలు, పిల్లల కోసం సులభమైన నియంత్రణలను పొందగలరన్నారు. వారి గృహోపకరణాల కోసం సజావు నిర్ధారణను పొందగలరన్నారు. ఏఐ పరివర్తన శక్తితో, బెస్పోక్ ఏఐ భారతదేశంలోని డిజిటల్ ఉపకరణాల మార్కెట్లో తమ నాయకత్వాన్ని బలపరుస్తుందని తాము విశ్వసిస్తున్నామన్నారు.

శాంసంగ్ ఇండియా డిజిటల్ అప్లయెన్సెస్ సీనియర్ డైరెక్టర్ సౌరభ్ బైశాఖియా మాట్లాడుతూ%రా% ఏఐ ఇంటిగ్రేషన్‌తో, గృహోపకరణాలు ఇప్పుడు తెలివిగా పని చేయగలవన్నారు. ఇంటి పనుల్లో పెట్టుబడి పెట్టే వినియోగదారుల సమయాన్ని, శక్తిని సమర్థవంతంగా తగ్గించగలవన్నారు. మెరుగైన కనెక్టివిటీ, ఏఐ సామర్థ్యాలను ఉపయోగించడం ద్వారా ఈ ఉపకరణాలు వినియోగదారుల అనుభవాన్ని మెరుగు పరుస్తాయన్నారు. స్మార్ట్ హోమ్ భావనను విప్లవాత్మకంగా మారుస్తాయన్నార. ఏఐ ఉపకరణాలతో తమ ప్రీమియం పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేయడం, ప్రీమియం ఉపకరణాల విభాగంలో తమ మార్కెట్ వాటాను విస్తరించడమే తమ లక్ష్యమన్నారు.

# పసిడి, వెండి పరుగులు..! సామాన్యులకు అందనంత ఎత్తుకు..!




పసిడి ధరలు పరుగులు తీస్తున్నాయి. రోజురోజుకు ధర సరికొత్త గరిష్ఠాలను తాకుతున్నది. ధరల పెరుగుదలతో బంగారం అంటేనే సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో బుధవారం బంగారం ధర తులానికి రూ.440 పెరిగింది. ఏప్రిల్ ఫ్యూచర్స్‌లో పసిడి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.69,487కి చేరుకుతున్నది. క్రితం సెషన్ ముగింపు ధరతో పోలిస్తే పోలిస్తే 0.64 శాతం పెరిగి రూ.69,369 వద్ద ట్రేడవుతోంది. అదే సమయంలో ఎంసీఎక్స్‌లో సిల్వర్ ఫ్యూచర్స్ ఏకాలంలో రెండు సంవత్సరాల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. కిలోకు రూ.77,957కు పెరిగింది. డాలర్ ఇండెక్స్ క్షీణించడం, యూఎస్ ఫెడలర్ రిజర్వ్ రేటు తగ్గింపు అంచనాలతో బంగారం ధరలు పెరుగుతున్నాయి. డాలర్ ఇండెక్స్ ప్రస్తుతం 104 మార్క్‌కు ఎగువన కొనసాగుతున్నది. కామెక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ట్రాయ్ ఔన్స్‌కి 2,308 డాలర్ల వద్ద గరిష్ఠ స్థాయికి చేరింది. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతల కారణంగా బంగారం సానుకూలంగా ట్రేడవుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ హెడ్ అనూజ్ గుప్తా మాట్లాడుతూ.. యుఎస్ ఫెడరల్ రిజర్వ్ రేటు తగ్గింపుపై ఆశలున్నాయని.. ఈ క్రమంలోనే ఇటీవల ధరలు పెరుగుతున్నాయన్నారు. కామెక్స్‌లో బంగారం 2,320 నుంచి 2,400 డాలర్లకు చేరుకోవచ్చున్నారు. ఎంసీఎక్స్‌లో 73,555 రేంజ్‌లో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. అంతర్జాతీయ మార్కెట్లలోని ధరల పెరుగుదల దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపుతున్నది. బులియన్ మార్కెట్‌లో బుధవారం 22 క్యారెట్ల గోల్డ్‌పై రూ.750 పెరిగి తులానికి రూ.64,100కి పెరిగింది. 24 క్యారెట్ల బంగారంపై రూ.760 పెరిగి తులం రూ.69,870కి చేరింది. అదే సమయంలో వెండి ధర సైతం భారీగానే పెరిగింది కిలోకు ఏకంగా రూ.2వేలు పెరిగింది. దేశంలోని పలు నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే ఢిల్లీలో 22 క్యారెట్ల గోల్డ్ రూ.64,250 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి రూ.70,020కి పెరిగింది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం రూ.65వేలు ఉండగా.. 24 క్యారెట్ల స్వర్ణం రూ.70,910కి చేరింది. ఆర్థిక రాజధాని ముంబయి నగరంలో 22 క్యారెట్ల పసిడి రూ.64,100 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం రూ.69,870కి పెరిగింది. ఇక హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల గోల్డ్ రూ.64,100 ఉండగా.. 24 క్యారెట్ల పుత్తడి రూ.69,870కి ఎగిసింది. కేరళ, బెంగళూరు, కోల్‌కతా, విజయవాడ నగరాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక వెండి ధర సైతం బంగారంతో నువ్వానేనా అన్నట్లుగా పోటీపడుతున్నది.

## అనుమానమే ఆదా చేసింది..

# మోసగాళ్లకు అదిరే జర్క్ ఇచ్చిన లాయర్

పోలీసుల కథనం ప్రకారం మోసగాళ్లు ఇటీవల 30 ఏళ్ల న్యాయవాదిని సంప్రదించారు. ఆమె ఇరాన్‌కు పంపడానికి ప్రయత్నించిన ప్యాకేజీలో సింథటిక్ డ్రగ్ ఎల్ఎస్డీ ఉందని ఆమెను భయపెట్టి కేసు పెడతామని బెదిరించి డబ్బు కొట్టేదామని ప్లాన్ వేశారు. అయితే ఆ లాయర్ ఎలా తెలివిగా వ్యవహరించి మోసాన్ని బయటపెట్టిందో? ఓ సారి తెలుసుకుందాం. ప్రఖ్యాత లాజిస్టిక్స్ కంపెనీ, లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చెందిన వారిగా నటిస్తూ మోసగాళ్లు ముంబైకి చెందిన మహిళా న్యాయవాది నుండి రూ.80 లక్షలను స్వాహా చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె అప్రమత్తంగా ఉండడం వల్ల ఎలాంటి ఆర్థిక నష్టం జరగలేదు. పోలీసుల కథనం ప్రకారం మోసగాళ్లు ఇటీవల 30 ఏళ్ల న్యాయవాదిని సంప్రదించారు. ఆమె ఇరాన్‌కు పంపడానికి ప్రయత్నించిన ప్యాకేజీలో సింథటిక్ డ్రగ్ ఎల్ఎస్డీ ఉందని ఆమెను భయపెట్టి కేసు పెడతామని బెదిరించి డబ్బు కొట్టేదామని ప్లాన్ వేశారు. అయితే ఆ లాయర్ ఎలా తెలివిగా



వ్యవహరించి మోసాన్ని బయటపెట్టిందో? ఓ సారి తెలుసుకుందాం. తాము ఒక ప్రముఖ లాజిస్టిక్స్ కంపెనీకి చెందినవారమని, మీరు పంపిన పార్శిల్‌లో అనుమానిత పదార్థాన్ని వారు కనుగొన్నారని వారు ఆమెకు చెప్పారు. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైందని, కేసును మూసివేయడానికి ఆమె ఆధార్, పాన్ కార్డ్ వివరాలను కోరారు.

# కేసీఆర్ తో ముగ్ధుంపూర్ రైతుల మొర



కరీంనగర్: వంట నష్టపోయిన రైతాంగానికి కష్టకాలంలో బిఆర్ఎస్ అండగా ఉంటుందని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, గులాబీ దళపతి కేసీఆర్ హామీ ఇచ్చారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా ముగ్ధుంపూర్ లో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించారు. ముగ్ధుంపూర్ పక్కనే ఉన్న వాగులో నీళ్లు లేక, తమ పంటలు ఎండిపోయాయని రైతులు వాపోయారు. తాను మూడెకరాల్లో సాగు చేస్తున్న వరి పంటకు నీరందక ఎండిపోయిందని బండి సంపత్ అనే రైతు కేసీఆర్ తో మొరపెట్టుకున్నాడు. తమకు ఎకరాకు రూ.25వేల రూపాయల నష్ట పరిహారం ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రైతులు కేసీఆర్ ను కోరారు. రైతులను కేసీఆర్ ఓదారుస్తూ, ఇలాంటి పరిస్థితి తెలంగాణలో వస్తుందని ఊహించలేదన్నారు. అన్నదాతలకు సాగునీరు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. ధైర్యంగా ఉండండి సాగునీరు ఇవ్వలేని ప్రభుత్వంపై పోరాడుదాం అని రైతులకు పిలుపునిచ్చారు. కేసీఆర్ వెంట కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ విప్ బాల్క సుమన్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు బారాస ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు ఉన్నారు. అంతకుముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటనకు బయల్దేరిన కేసీఆర్ కు సిద్దిపేట రంగదాంపల్లి అమరవీరుల స్థూపం వద్ద ఘన స్వాగతం లభించింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జై కేసీఆర్, జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్ వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు కూడా ఈ పర్యటనలో పాల్గొంటున్నారు.

# మాజీ డిసిపి రాధాకిషన్‌కు అస్వస్థత



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా రెండో రోజు టాస్క్ ఫోర్స్ మాజీ డిసిపి రాధా కిషన్ రావును పోలీసులు విచారిస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. రాధా కిషన్ రావువు హైబిపి రావడంతో వైద్యులకు దర్యాప్తు బృందం సమాచారం ఇచ్చింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లోనే రాధా కిషన్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ4గా రాధాకిషన్ ఉన్న విషయం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ డిసిపి రాధాకిషన్ రావును కస్టడీకి కోరుతూ పోలీసులు వేసిన పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. పది రోజుల కస్టడీ ఇవ్వాలని కోర్టును కోరారు. పోలీస్ కస్టడీకి ఏడు రోజులు అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 4 నుంచి 10వ తేదీ వరకు రాధాకిషన్ రావు పోలీసుల కస్టడీలో ఉండనున్నాడు.

# నేత కార్మికుడి ఇంట్లో భోజనం చేసిన అన్నామలై..



లోక్‌సభ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఇప్పటికే తొలి విడత లోక్‌సభ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ ముగిసింది. రెండో విడత లోక్‌సభ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ కూడా ముగింపు దశకు చేరుకుంది. ఏప్రిల్ 19న తొలి విడత ఎన్నికల పోలింగ్, ఏప్రిల్ 26న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు వివిధ పార్టీలు తమ అభ్యర్థుల తరఫున జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఈసారి తమిళనాడులో తప్పనిసరిగా పాగా వేయాలని భావిస్తున్న బీజేపీ ఎన్నికల ప్రచారంలో సీరియస్‌గా దూసుకుపోతున్నది. తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు, కోయంబత్తూరు లోక్‌సభ అభ్యర్థి అన్నామలై ఇవాళ తన నియోజకవర్గంలో పర్యటించారు. కోయింబత్తూరు లోక్‌సభ నియోజకవర్గంలోని ఎలాచియపాలయం గ్రామానికి వెళ్లిన అన్నామలైకి స్థానిక బీజేపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. అనంతరం గ్రామంలోని ఓ నేత కార్మికుడి ఇంటికి వెళ్లిన అన్నామలై ఆ కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు. వారితో కాసేపు ముచ్చటించారు. అనంతరం తన ప్రచారాన్ని కొనసాగించారు.


# బిజెపిలో చేరిన మాండ్య ఎంపీ సుమలత అంబరీశ్



బెంగళూరు: సీనియర్ నటి, మాండ్య నియోజకవర్గ స్వతంత్ర్య అభ్యర్థి ఎంపీ సుమలత అంబరీశ్ భారతీయ జనతా పార్టీలో చేరారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో శుక్రవారం ఉదయం బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. తాను బిజిపిలో చేరనున్నట్లు ఇటీవలే సుమలత ప్రకటించిన విషయం తెలిసిందే. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, జెడిఎస్ దళానికి సపోర్టు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మాండ్యాను తాను విడిచిపెట్టడం లేదని, రాబోయే రోజుల్లో మీకోసం నేను పనిచేయడం చూస్తారని, బిజెపిలో చేరడానికి డిసైడ్ అయినట్లు సుమలత తెలిపారు. 2019 నాటి ఎన్నికల్లో బిజెపి మద్దతుతో కుమారస్వామి కుమారుడు నిఖిల్‌పై సుమలత విజయం సాధించిన విషయం తెలిసిందే. సీట్ షేరింగ్ ఫార్ములా ప్రకారం.. కర్నాటకలో బిజెపి 25 స్థానాల్లో పోటీ చేయనున్నది. జెడీఎస్ మూడు చోట్ల పోటీ చేస్తుంది. ఈసారి మాండ్య నుంచి జెడీఎస్ పోటీలో నిలబడనున్నది. తాను స్వతంత్ర్య ఎంపీగా ఉన్నా.. కేంద్రంలోని బిజెపి సర్కారు మాండ్య లోక్‌సభ నియోజకవర్గానికి 4 వేల కోట్ల నిధుల్ని రిలీజ్ చేసినట్లు సుమలత వెల్లడించారు. బిజెపి నుంచి రాజ్యసభకు సుమలత వెళ్లే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# త్వరలో మిమ్ములందరినీ బయటికొచ్చి చూస్తా..

# ఢిల్లీ ప్రజలకు జైలు నుంచి ఆప్ నేత లేఖ



ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టయ్యి తీహార్ జైల్లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకుడు మనీశ్ సిసోడియా ఢిల్లీ ప్రజలను ఉద్దేశించి జైలు నుంచి ఒక లేఖ రాశారు. 'త్వరలో మిమ్ములందరినీ బయటికొచ్చి కలుస్తా' అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా అనారోగ్యంతో ఉన్న తన భార్యను జాగ్రత్తగా చూసుకుంటున్న తన ప్రతాప్‌గంజ్ నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తీహార్ జైలు నుంచి మనీష్ సిసోడియా ఢిల్లీ ప్రజలను ఉద్దేశించి లేఖ రాయడం ఇది రెండోసారి. ఇటీవల హిందీలో రాసిన ఈ రెండో లేఖ శుక్రవారం సోషల్ మీడియాలో చక్కెర్లు కొడుతోంది. బ్రిటిషర్‌ల కాలంలో స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాళ్లు జైలుపాలైనట్టే ఇప్పుడు తాను జైలుపాలయ్యానని లేఖలో ఆయన రాశారు. గత ఏడాదికాలంగా నేను మీతో ఎడబాటును భరిస్తున్నానని రాసుకొచ్చారు. 'మిమ్ములందరినీ బయటికొచ్చి కలుస్తా. విద్యా విప్లవం చిరకాలం కొనసాగుతుంది. మిమ్మల్ని అందరినీ ప్రేమిస్తున్నా. గడిచినా ఏడాది కాలంగా నేను మీ అందరిని మిస్సవుతున్నా. అయినా ప్రతి ఒక్కరినీ గుర్తుపెట్టుకున్నా. అందరూ కలిసికట్టుగా నిజాయితీగా పనిచేశారు. మనం మంచి విద్య కోసం పోరాడుతున్నాం. ఏళ్ల పోరాటం తర్వాత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టే ఏదో ఒకరోజు ప్రతి బిడ్డ మంచి విద్యను పొందుతారు' అని సిసోడియా తన లేఖలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల



ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, చిదంబరం పాంచ్ న్యాయ్‌పత్ర పేరుతో ఆ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, సంక్షేమం సూత్రాలపై కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐసిసి ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ గతంలో అభివృద్ధి చేసిందని, మళ్లీ అధికారంలోకి రాగానే అభివృద్ధి కొనసాగిస్తామని, కులగణన చేస్తామని ఖర్గే స్పష్టం చేశారు. పేద మహిళలకు ఏడాదికి రూ. లక్ష అందిస్తామని, కిసాన్ న్యాయ్ పేరుతో రైతులను ఆదుకుంటామని, కనీస మద్దతు ధర చట్టం తీసుకొస్తామని, విద్యార్థులకు రూ. లక్ష ఆర్థిక సాయం చేస్తామని, రైతులను ఆదుకునేందుకు రుణమాఫీ ప్రకటిస్తామన్నారు.

రైతు రుణమాఫీ
కనీస మద్దత ధరకు చట్టబద్ధత
వ్యవసాయ పరికరాలకు జిఎస్‌టి రద్దు
కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు
ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ.400 వేతనం
ఎలక్టోరల్ బాండ్స్‌పై విచారణ
పెగాసెస్, రాఫెల్‌పై విచారణ
రైల్వే ఛార్జీలు తగ్గింపు, వృద్ధులకు టికెట్లలో రాయితీ
కులగణన
50 శాతం రిజర్వేషన్లపై పరిమితి ఎత్తివేత
పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం
రైల్వేల ప్రైవేటీకరణ నిలిపివేస్తాం
అగ్నీవీర్ స్కీం రద్దు చేయడంతో పాటు పాత పద్దతిలోనే ఆర్మీ రిక్రూట్మెంట్
యువతకు 30 లక్షల ఉద్యోగాల భర్తీ
మహాలక్ష్మీ స్కీంతో ఏడాదికి రూ. లక్ష సాయం

# బిహార్‌లో 26 స్థానాల నుంచి బరిలో నిలవనున్న ఆర్జేడీ



న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలకు బిహార్ మహాకూటమి పొత్తలపై మాజీ డిప్యూటీ సీఎం, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ కీలక వివరాలు వెల్లడించారు. ఆర్జేడీ 26 స్థానాల నుంచి పోటీ చేస్తుందని అయితే తమ పార్టీ కోటా నుంచి మూడు స్థానాలను ముఖేష్ సాహ్ని పార్టీకి కేటాయించాలని నిర్ణయించామని చెప్పారు. గోపాల్‌గంజ్, ఝంఝాపూర్, మోతిహారి స్థానాలను ముఖేష్ సాహ్ని పార్టీకి కేటాయించామని తెలిపారు. ఇక తేజస్వి యాదవ్ ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. ప్రధాని మాటలకు, చేతలకు పొంతన ఉండదని దుయ్యబట్టారు. బిహార్‌లో ప్రధాని మోదీ తొలి ర్యాలీలో ఆయన వ్యాఖ్యలను ఉద్దేశించి తేజస్వి యాదవ్ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ప్రధాని బంధుప్రీతికి వ్యతిరేకంగా మాట్లాడారా అని ప్రశ్నించారు. ప్రధాని తన కూటమికి చెందిన కుటుంబ వారసత్వ అభ్యర్థికి మద్దుతగా ప్రచారం చేశారని, మోదీ మాటలకు, చేతలకు పొంతన ఉండదని తేజస్వి యాదవ్ ఎద్దేవా చేశారు. మోదీ తన ఎన్నికల ప్రచారంలో ఎప్పుడూ వారసత్వ రాజకీయాలపై మాట్లాడతారని, కానీ బిహార్‌లో తన తొలి ప్రచార సభలోనే వారసత్వ రాజకీయ నేత తరపున ప్రచారం చేశారని విమర్శించారు. ప్రధాని మాటలకు, చేతలకు తేడా ఉంటుందని ఇది తేటతెల్లం చేస్తుందని అన్నారు. ఇతర పార్టీల నేతలు బీజేపీలో చేరితే వారిపై సీబీఐ, ఈడీ కేసులు మూసివేస్తారని, వారిని మంత్రులుగా చేస్తారని అన్నారు.

# వేసవిలో తిరుమలకు వెళ్లే భక్తులకు గుడ్ న్యూస్



తిరుపతి: వచ్చే మూడు నెలల్లో తిరుమలలో భక్తుల రద్దీ పెరుగుతుందని అంచనా వేస్తోంది టిటిడి. వచ్చే మూడు నెలల పాటు రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టిటిడి ఈవో ధర్మా రెడ్డి తెలిపారు. తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమం అనంతరం వేసవిలో ఏర్పాట్లపై వివరాలను వెల్లడించారు. వేసవిలో విఐపి బ్రేక్ దర్శనాన్ని రద్దు చేయాలని టిటిడి బోర్డు తీర్మానం చేసిందని.. తద్వారా సాధారణ భక్తుల దర్శనానికి ఎక్కువ సమయం ఉండేలా చూస్తామన్నారు. సాధారణ భక్తుల సౌకర్యార్థం సాధారణ భక్తులకు ఎక్కువ దర్శన వేళలు ఇస్తూ సిఫార్సు లేఖలపై విఐపి దర్శనాన్ని టిటిడి రద్దు చేసిందని తెలిపారు. క్యూ లైన్లు, కంపార్ట్‌మెంట్లు, బయట లైన్లలో వేచి ఉన్న భక్తులకు అన్నప్రసాదం, మజ్జిగ, అల్పాహారం, నిరంతరాయంగా పంపిణీ చేస్తామన్నారు. వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే తిరుమల మాడ వీధులు, నారాయణగిరి గార్డెన్స్ వెంబడి కూల్ పెయింటింగ్స్ వేయించడంతో పాటుగా తాగునీరు పాయింట్లు వంటివి ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాదు ఎన్నికల కోడ్ కూడా అమల్లో ఉండటంతో టిటిడి సిఫార్సు లేఖల్ని అనుమతించడం లేదు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి.. కాబట్టి జూన్ 10 వరకు ఈ లేఖల్ని అనుమతించే అవకాశం ఉండదని సమాచారం.

# కంగనా రనౌత్ వ్యాఖ్యలపై కెటిఆర్ మండిపాటు



న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్ లో బిజెపి నుంచి పార్లమెంటు ఎన్నికలకు పోటీచేస్తున్న కంగనా రనౌత్ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ అధ్యక్షుడు కెటి. రామారావు మండిపడ్డారు. ఆమె హిమాచల్ ప్రదేశ్ లోని మండి సీటు నుంచి పోటీచేస్తున్నారు. కాగా ఆమె స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ను 'తొలి భారత ప్రధాని'అని వ్యాఖ్యానించడంపై కెటిఆర్ మండిపడ్డారు. ఆయన ఎక్స్ పోస్ట్ లో "ఉత్తర భారత దేశం నుంచి ఓ బిజెపి అభ్యర్థి సుభాష్ చంద్రబోస్ తొలి ప్రధాని అంటారు. దక్షిణాది నుంచి ఓ బిజెపి నాయకుడు మహాత్మా గాంధీ మన ప్రధాని అంటారు!! వీరంతా ఎక్కడి నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని వచ్చారు?" అని పేర్కొన్నారు. ఓ టెలివిజన్ ఇంటర్వ్యూ లో కంగనా రనౌత్ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ తొలి ప్రధాని అన్నారు. కంగనా రనౌత్ ఇదివరలో కూడా మోడీ 2014లో ప్రధాని అయ్యాకే భారత్ కు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. కంగనా రనౌత్ ఇప్పుడు బిజెపి తరఫున లోక్ సభకు పోటీచేస్తున్నారు. ఆమె బిజెపికి గట్టి మద్దతుదారు. హిమాచల్ ప్రదేశ్ లో జూన్ 1న నాలుగు స్థానాలకు సింగిల్ ఫేస్ లో ఓటింగ్ జరుగనున్నది. ప్రస్తుతం నాలుగు లోక్ సభ సీట్లలో బిజెపికి మూడు, కాంగ్రెస్ ఒక సీటు ఉన్నాయి.

# కిషన్ రెడ్డిగారూ మీ మాటలు ఎలా నమ్మాలి?



ఔను.. ఇప్పుడు కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి ఈ ప్రశ్నే ఎదురవుతోంది. మిమ్మల్ని ఎలా నమ్మాలండీ అంటూ.. తెలంగాణ సమాజం ప్రశ్నిస్తోంది. దీనికి కారణం.. తన ఫోన్ కూడా ట్యాపింగ్ గునకు గురైందని.. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని లైట్ తీసుకున్నా.. తాము వదిలి పెట్టబోమని.. బీజేపీ ప్రభుత్వం కూసాలు కదిలిస్తుందని భారీ డైలాగులు పేల్చారు. అయితే, ఇప్పటికీ కేంద్రంలో ఉన్నదిబీజేపీనే కదా.. మీరు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నది జనం టాక్. ఇంతకీ కిషన్ రెడ్డి ఏమన్నారంటే.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గవర్నర్ జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసి డబ్బులు వసూలు చేసినట్టు వార్తలు వస్తున్నాయని చెప్పారు. దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఎన్నికల సమయంలో తన ఫోన్ ను కూడా ట్యాప్ చేశారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ను కాంగ్రెస్ ప్రభుత్వం వదిలి పెట్టినా... బీజేపీ వదలదని అన్నారు. అయితే.. అసలు కిషన్ రెడ్డి చెబుతున్నట్టుగా ఆయన ఫోన్ ట్యాప్ అయింది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com